ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కాకినాడ

జిల్లా వార్తలు

బుధవారం 27 నవంబరు 2024 | 5





ఐపీఎల్‌లో గోగన్నమఠం కుర్రోడు

రూ.30 లక్షల రేటు పలికిన సత్యనారాయణరాజు

కాకినాడలోనూ హర్షాతిరేకాలు - 6లో



కొబ్బరి పువ్వు.. రుచే వేరు!

- 6లో

'భూ'చోళ్లు!



పెద్దాపురం మండలం దివిలిలో జరిగిన భూ రీసర్వే సమస్యల పరిష్కార వేదిక (ఫైల్)

- గత వైసీపీ సర్కారు నిర్వాకం ఫలితం
- జిల్లాలో కుప్పలు తెప్పలుగా భూసమస్యలు, కబ్జాలపై ఫిర్యాదుల వెల్లువ
- కూటమి ప్రభుత్వం వచ్చిన అయిదు నెలల్లో 11,059 అర్జీలు రాక
- ఇందులో రీసర్వేతో తలెత్తిన భూవివాదాల ఫిర్యాదులే 8,537
- రీసర్వే పేరుతో తమ భూముల కాజేశారంటూ ఎక్కువమంది బాధితుల ఆవేదన
- గత వైసీపీ ప్రభుత్వంలో జగనన్న భూసర్వే పేరుతో 292 గ్రామాల్లో చిచ్చు
- మరోపక్క భూఫిర్యాదులు పెరుగుతుండడంపై డిప్యూటీ సీఎం పవన్ ఆగ్రహం
- భూకబ్జాలు, ఆక్రమణలపై కాకినాడ జిల్లా నుంచి ఫిర్యాదులపై చర్యలకు ఆదేశాలు



గత వైసీపీ ప్రభుత్వ పాపాలతో జిల్లాలో భూవివాదాలు, కబ్జాలపై ఫిర్యాదులు అంతకంతకూ పెరుగుతున్నాయి. న్యాయం కోసం ప్రభుత్వాన్ని ఆశ్రయిస్తోన్న బాధితుల సంఖ్యను పెంచుతున్నాయి. తమ భూములు కబ్జాకు గురయ్యాయని కొందరు, రీసర్వే పేరుతో భూములు లాగేసుకున్నారని మరికొందరు కూటమి ప్రభుత్వాన్ని భారీగా ఆశ్రయిస్తున్నారు. తిరిగి తమ భూములు తమకు ఇప్పించాలంటూ కుప్పలు తెప్పలుగా పిర్యాదులు అందిస్తున్నారు. దీంతో కొత్త ప్రభుత్వం కొలువుదీరిన ఈ అయిదునెలల్లో వచ్చిన ఫిర్యాదులు అక్షరాలా 11,059. ఇందులో ఏకంగా 8,537 అర్జీలు జగనన్న భూముల రీసర్వే పేరుతో తమను మోసం చేశారంటూ వచ్చినవే. చెప్పాలంటే గత ప్రభుత్వంలో జిల్లాలో 20 మండలాల్లో 292 గ్రామాల్లో చేపట్టిన భూసర్వే అత్యంత వివాదాస్పదంగా మారింది. ఎన్నో ఏళ్ల నుంచీ పక్కా హద్దులతో కొనసాగుతున్న భూములను సర్వే పేరుతో కలగాపులగం చేసేయడంతో వివాదాలు పెరిగిపోయాయి. మరోపక్క జిల్లా నుంచే అత్యధికంగా భూ కబ్జాలు, సమస్యలపై ఫిర్యాదులు రావడంపై డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ దృష్టి పెట్టారు.

(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

జిల్లాలో ఎన్నో ఏళ్ల నుంచీ పక్కా హద్దులు, రికార్డులతో కొనసాగుతున్న భూములను జగనన్న శాశ్వత భూహక్కు రీసర్వే పేరుతో వివాదాస్పదంగా మార్చేశారు. హడావుడి సర్వే పేరుతో అధికారులపై ఒత్తిడి తెచ్చి 20 మండలాల్లో 292 గ్రామాల్లో రీసర్వే చేయించారు. దీంతో అనేక వివాదాలు తలెత్తాయి. భూయజమానులు లేకుండానే ఇష్టానుసారంగా గ్రామాల్లో అధికారులు సర్వేలు చేసేశారు. ఫలితంగా వేలాదిమంది భూముల విస్తీర్ణం తగ్గిపోయాయి. పాస్‌బుక్‌ల్లో ఉన్న భూమికి బదులు విస్తీర్ణం తగ్గించేసి అధికారులు నివేదికలు సిద్ధం చేసేశారు. అలాగే హద్దులు మార్చేశారు. తరాలతరబడి వారసత్వంగా వస్తోన్న భూములను సైతం పక్క సర్వే నెంబర్లలో కలిపేశారు. అసలు లేని పేర్లను సర్వే పేరుతో తెచ్చి కొత్త విస్తీర్ణం సృష్టించేశారు. ఇలా ఒకటికాదు రెండు కాదు వందలాది కొత్త వివాదాలు భూసర్వే పేరుతో తలెత్తాయి. అయితే తమకు జరిగిన అన్యాయంపై బాధితులు అధికారుల వద్దకు వెళ్లినా కనీసం పట్టించుకోలేదు. ఎక్కడో దేశవిదేశాల్లో ఉంటున్న వారు సైతం రీసర్వే తీరుతో నష్టపోయారు. ప్రభుత్వం న్యాయం చేస్తేందనే ఆశతో పిర్యాదు ఇచ్చినా కనీసం పట్టించుకోలేదు. అటు జిల్లా మొత్తం రీసర్వే వేగంగా పూర్తి చేయాలనే ప్రభుత్వ ఒత్తిళ్లతో సమస్యల పరిష్కారంపై అసలు అధికారులు సైతం దృష్టిపెట్టలేదు. దీంతో జిల్లావ్యాప్తంగా వేలాది మంది భూసమస్యలతో సతమతమయ్యారు. మరోపక్క పక్కపక్క భూయజమానులు సైతం రీసర్వే తీరుతో కొట్లాడుకున్న పరిస్థితులు తలెత్తాయి. అనేక సొంత కుటుంబాల్లో సైతం చిచ్చు రేగింది. వీటిపై అప్పట్లో కలెక్టర్ గ్రీవెన్స్‌సెల్‌కు ఫిర్యాదు చేసినా కనీసం పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో ప్రభుత్వం మారి కూటమి సర్కారు కొలువుదీరడంతో అప్పటి జగన్ సర్కారు బాధితులు న్యాయం కోసం ప్రభుత్వాన్ని ఆశ్రయించడం మొదలు పెట్టారు. ఇదికాకుండా అప్పటి ప్రభుత్వంలో తమ భూములను వేర్వేరు భవనాల నిర్మాణం పేరుతోను, ఇళ్ల స్థలాల అవసరాల పేరుతోను అధికారులు లాక్కోవడానికి నోటీసులు ఇచ్చారు. అటు వైసీపీ స్థానిక నేతలు సైతం విలువైన భూములపై కన్నేసి కబ్జాకు ప్రయత్నాలు చేశారు. ఇలా వీటన్నింటిపై ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా ఈ అయిదునెలల్లో ఏకంగా 11,059 మంది బాధితులు వివిధ భూసమస్యలు పరిష్కరించాలంటూ గ్రామ,మండల స్థాయిల్లో గ్రామసభల ద్వారా ఫిర్యాదులు చేశారు. ఇందులో ఒక్క రీసర్వే పేరుతో తలెత్తిన భూవివాదం కారణంగా నష్టపోయిన తమకు న్యాయం చేయాలంటూ పెట్టుకున్న అర్జీలు 8,537 ఉన్నాయి. రాష్ట్రం మొత్తం మీద ఈ తరహా వెల్లువెత్తిన అర్జీలు జిల్లాలోనే అధికం. రీసర్వే పేరుతో గత జగన్ ప్రభుత్వం చేసిన తప్పిదాలు, సృష్టించిన వివాదాలకు ఈ ఫిర్యాదులే తార్కాణమని అధికారులు సైతం చెబుతున్నారు. మరోపక్క ఈతరహా ఫిర్యాదులపై దృష్టిసారించి సమస్యలు పరిష్కరించాలని కూటమి ప్రభుత్వం చెబుతోంది. కానీ సర్వే అధికారులు సర్వే ద్వారా ఈ తప్పిదాలను సరిదిద్దేందుకు ప్రయత్నిస్తున్నా ఒకపట్టాన తేలడం లేదు. ఒకరికి న్యాయం చేస్తే రీసర్వేలో అడ్డగోలుగా పెరిగిన భూమిని వదులుకోవడానికి ఎదుటి పక్షం అంగీకరించడం లేదు. దీంతో ఫిర్యాదుల పరిష్కారం తలకుమించిన భారంగా మారుతోంది. ఒకరకంగా రీసర్వే చిక్కులపై వచ్చిన 8,537 ఫిర్యాదుల్లో ఇంతవరకు పరిష్కారమైనవి కేవలం 712 మాత్రమే. దీన్నిబట్టి గత వైసీపీ సర్కారు పాపాల ఫలితంగా బాధితులకు న్యాయం చేయడం ఎంతకష్టంగా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. అయితే జిల్లాలో అప్పట్లో రీసర్వే జరిపిన 292 గ్రామాల్లో ఆదరాబాదరగా చేసిన రీసర్వే పూర్తిగా తప్పులతడకగా మారింది. బయట ప్రాంతాల నుంచి వచ్చిన సర్వేయర్లు సైతం టార్గెట్లను పూర్తిచేయడానికి మమ సర్వేను అనిపించేశారు. ఇప్పుడు ప్రభుత్వం మారినా గత ప్రభుత్వంలో రీసర్వే పేరుతో మార్చేసిన రికార్డులను సరి చేయడం చాలాకష్టతరంగా మారుతోంది.

ఏంటిది...

రెవెన్యూ, పంచాయతీ, దేవదాయ భూముల ఆక్రమణతోపాటు, సామాన్యుల భూమలు సైతం జిల్లాలో కబ్జాకు గురవుతున్నాయని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఇటీవల ఆగ్రహం వ్యక్తంచేశారు. ముఖ్యంగా కాకినాడ జిల్లా నుంచి ఈ తరహా ఫిర్యాదులు అధికంగా ఉన్నాయని మరీ ప్రస్తావించారు. దీనిపై జిల్లా కలెక్టర్, ఎస్పీ తక్షణం చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వాస్తవానికి రీసర్వే ఫిర్యాదులు జిల్లాలో వేలల్లో ఉండడం, వీటిపై అధికారులు పరిష్కారం చూపకపోవడంతో అనేకమంది బాధితులు అమరావతి వెళ్తున్నారు. అక్కడ టీడీపీ, జనసేన కార్యాలయాల్లో నిర్వహించే గ్రీవెన్స్‌సెల్‌లో తమ ఆవేదన వెళ్లగక్కుతున్నారు. ఈ నేపథ్యంలో పవన్ ఈవిధంగా స్పందించడం గత వైసీపీ ప్రభుత్వం ఎన్ని భూవివాదాలు సృష్టించిందో చాటుతోంది. పవన్ హెచ్చరికతో కలెక్టర్, ఎస్పీలు భూవివాదాలు, ఫిర్యాదులపై అప్రమత్తమయ్యారు. ఫిర్యాదులపై ప్రత్యేక సభలు పెడుతున్నారు. రీసర్వే చిక్కులపై స్వయంగానూ సమీక్షిస్తున్నారు.

ఉప్పాడ సముద్ర తీరంలో అలల ఉధృతి

తీరంలో అలజడి

అల్పపీడన ప్రభావంతో ఈదురు గాలులు

వేట సామగ్రి సురక్షిత ప్రాంతాలకు

తరలించుకున్న మత్స్యకారులు 7

ధాన్యాన్ని చక్కబెట్టుకోవాలి : జేసీ

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతుల కళ్లాల్లో ఉన్న ధాన్యాన్ని త్వరగా చక్కబెట్టుకోవాలని జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్‌మీనా సూచించారు. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిన నేపథ్యంలో జిల్లాలో వర్షాలే కురిసే అవకాశం ఉందన్నారు. ఈ నేపథ్యంలో పనలపై ఉన్న వరి కంకులను కూడా త్వరితగతిన తరలించుకోవాలని సూచించారు. ధాన్యం తడిచిపోకుండా బరకాలతో భద్రపర్చుకోవాలన్నారు.



బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్

కలెక్టరేట్‌లో ఘనంగా భారత రాజ్యాంగ దినోత్సవం

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 26(ఆంధ్రజ్యోతి): 75వ భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్, డీఆర్వో వెంకట్రావు, జెడ్పీసీఈవో లక్ష్మణరావు తదితరులు కలిసి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారత రాజ్యాంగ అమలులోకి వచ్చి నేటికి 75 సంవత్సరాలు పూర్తయిందన్నారు. దేశవ్యాప్తంగా వజ్రోత్సవాలు జరుపుకుంటున్న నేపథ్యంలో వివిధ శాఖల అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ సత్యనారాయణ, డ్వామా పీడీ వెంకటలక్ష్మి, సీపీవో త్రినాథ్ పాల్గొన్నారు.

భగవత్ సంకల్పంతోనే కార్య సిద్ధి -7లో

శృంగేరీ పీఠాధిపతి విధుశేఖర భారతీమహాస్వామి



ఢిల్లీలో రైల్వేమంత్రికి జ్ఞాపిక అందజేస్తున్న పవన్, ఉదయ్ శ్రీనివాస్

పిఠాపురంలో రైళ్ల హాల్టు, రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి పవన్ వినతి

పిఠాపురం, నవంబరు26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పిఠాపురం నియోజకవర్గ శాసనసభ్యుడు పవన్‌కల్యాణ్ కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌తో మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు పిఠాపురం రైల్వే స్టేషన్‌లో రైళ్లు నిలుపుదల చేయాలని, రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని కోరారు. పిఠాపురం మున్సిపాల్టీ పరిధిలో సామర్లకోట, ఉప్పాడ రోడ్డు రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణం అవసరం వివరిస్తూ ఆర్‌వోబీ మంజూరు చేయాలని కోరారు. ఢిల్లీలో మంగళవారం ఆయనను కలిసిన పవన్ పలు రైల్వే ప్రాజెక్టుల అవసరాలపై సుదీర్ఘంగా చర్చించారు. పిఠాపురం పట్టణ పరిధిలో వీవీ సెక్షన్, సామర్లకోట-ఉప్పాడ రోడ్డులో రైల్వే కిలోమీటర్ 6.40 బార్30-32 వద్ద లెవెల్ క్రాసింగ్ నంబరు 431 బదులుగా ఆర్‌వోబీ అవసరమని రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిందన్నారు. నిరంతరం ట్రాఫిక్ రద్దీని పరిష్కరించడానికి ఆ ప్రాంతంలో రోడ్డు కనెక్టివిటీని మెరుగుపరచడానికి, మౌలిక సదుపాయాలన కల్పనకు ప్రధాన మంత్రి గతిశక్తి ప్రాజెక్టు ప్రాజెక్టు కింద నిదులు మంజూరు చేయాలని కోరారు. అలాగే శ్రీపాద శ్రీవల్లభ సంస్థానానికి దేశం నలమూలల నుంచి భక్తులు వస్తున్నారని, పలు రైళ్లకు హాల్టు కల్పించాలని కోరారు. వాటిలో నాందేడ్ సంబల్‌పూర్ నాగవళి, నాందేడ్ విశాఖపట్నం సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం సాయినగర్ షిర్డీ ఎక్స్‌ప్రెస్, విశాఖపట్నం న్యూఢిల్లీ ఏపీ ఎక్స్‌ప్రెస్ నిలుపుదల అవసరమని తెలిపారు. అనంతరం జ్ఞాపికను అందజేశారు. ఆయన వెంట ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, ఎంపీ బాలశౌరి ఉన్నారు.

జూనియర్ కళాశాలల్లో విద్యా బోధనపై దృష్టి పెట్టాలి : కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), నవంబరు26(ఆంధ్రజ్యోతి): జూనియర్ కళాశాల్లో చదువుతున్న విద్యార్థుల విద్యా బోధనపై ప్రత్యేక దృష్టి పెట్టి క్వార్టర్లీ పరీక్షలు మార్కుల ఆధారంగా ఉత్తీర్ణశాతం మెరుగుపడేలా కళాశాలల ప్రిన్సిపాల్స్ తగిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ షాన్‌మోహన్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లో జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్స్‌తో క్వార్టర్లీ పరీక్షల ఉత్తీర్ణశాతం, అపార్ నమోదు ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఉన్నాయన్నారు. ఈ కళాశాలల్లో చదువుతున్న ఇంటర్మీడియట్ మొదటి, రెండో సంవత్సరం విద్యార్థుల విద్యా బోధనలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఇంటర్మీడియట్ క్వార్టర్లీ పరీక్షల ఫలితాల ఆధారంగా చేసుకుని పబ్లిక్ పరీక్షల్లో మరింత ఎక్కువ ఉత్తీర్ణశాతం సాధించే దిశగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కొన్ని మండలాల్లో పుట్టిన తేదీ, పేరు తదితర వివరాలు తప్పుగా నమోదుకావడం వల్ల వాటిని సరిచేసి ఆధార్‌ను అనుసంధానం చేసి అపార్ నమోదును త్వరితగతిన పూర్తిచేయాలన్నారు. ఈ సమావేశంలో డీఐఈవో నూకరాజు, వివిధ కళాశాలలకు చెందిన ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.



కొబ్బరి పువ్వు.. రుచే వేరు!

పోషకాలు మెండు

షుగర్, క్యాన్సర్ రాకుండా దూరం చేసే కోకోనట్ ఫ్లవర్

కొబ్బరిలో ప్రతి వస్తువు మనకు ఉపయోగమే. కొబ్బరిలో ఆరోగ్య వంతమైన పోషకాలు ఉంటాయి. ఇందులో కొబ్బరి పువ్వు ఒకటి. గుండ్రంగా తెల్లగా గుడ్డు ఆకారంలో కనిపించే ఈ కొబ్బరి పువ్వును ఒకసారి రుచి చూస్తే మళ్లీ మళ్లీ తినాలనిపిస్తుంది. అందంగా కనిపించే ఈ కొబ్బరి పువ్వుకు అంతే విలువా ఉంది. వీటిని కొబ్బరిపూలు, కొబ్బరి గుడ్లు అని పిలుస్తారు. అరుదుగా లభించే ఈ కొబ్బరి పూలను ఈ ప్రాంతం ప్రజలే కాకుండా దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారూ కొబ్బరి పూలను కొనుగోలు చేసుకుని తింటుంటారు. దేవుడికి సమర్పించే కొబ్బరికాయ కొట్టినప్పుడు కొబ్బరిచెక్కలో ఈ పువ్వు వస్తే చాలా అదృష్టంగా భావించడం తెలిసిందే.

(ఆంధ్రజ్యోతి-అంబాజీపేట)

కోనసీమ ప్రాంతంలో రైతులు నీటికాయ వ్యాపారులు దింపి తీసిన కొబ్బరికాయలను పెద్ద పెద్ద రాశులుగా పోసి సరైన గిట్టుబాటు ధర వచ్చినప్పుడు వాటిని అమ్మడం సర్వసాధారణం. ఇలా పచ్చికాయలను నాలుగు నెలలపాటు ఉంచితే ఆరు బయట, కొబ్బరి ఆకులు కప్పి ఉంచితే వాటి రంగు మారి ముక్కుడు కాయలుగా మారుతాయి. ఈ కాయలు ఎక్కువకాలం నిల్వఉంటే బయట వాతావరణంలో ఉన్న తేమ శాతాన్ని వర్షపు నీటిని పీల్చుకుని మొక్కలు మొలిచి కొబ్బరికాయల్లో పూలు అభివృద్ధి చెందుతాయి. కొబ్బరికాయలకు తేమశాతం ఎక్కువగా లభించినప్పుడు ప్రకృతిపరంగా జరిగే ప్రక్రియ వల్ల కాయల లోపల తెల్లని అంకురం మొలుస్తుంది. ఇది క్రమంగా పెరిగి పెద్దదై పువ్వుగా మారి కాయల లోపల పెరుగుతూ లోపల ఉన్న నీటిని పీల్చుకుంటూ కాయ లోపలున్న ఖాళీ ప్రదేశాన్ని ఆక్రమిస్తుంది. ఈ పువ్వులను యాపిల్ లేదా హాస్టోరియం అనే శాస్త్రీయ నామంతో పిలుస్తారు. ఈ కొబ్బరి పూలు కొబ్బరినీటిలో ఉండే పోషక విలువల్ని గ్రహిస్తూ ఎంజైమ్స్ సహాయంతో లోపల ఉండే కొబ్బరి మందాన్ని తగ్గిస్తూ పూర్తి పోషక పదార్థాలతో పూలు తయారువుతాయి.

పోషకాలు మెండు..

ఈ పువ్వులో ఒమెగా 3 ఫ్లాటీ ఆమ్లాలు, ఒమెగా 6 ఫ్లాటీ ఆమ్లాలు మెండుగా ఉంటాయి. విటమిన్-సి, విటమిన్- ఎ, ఐరన్, కాపర్, పొటాషియం, కాల్షియం మొదలైనవి ప్రతిరోజూ ఈ కొబ్బరి పువ్వు తినడం వల్ల శరీరానికి కావాల్సిన ఖనిజ లవణాలు అందుతాయి. ఫైబర్ ఎక్కువగా ఉండడంతో జీర్ణశక్తిని పెంచి మలబద్ధకాన్ని నివారిస్తుంది. చిన్న పిల్లలకు, చదువుకునే వారికి జ్ఞాపకశక్తిని పెంచుతుంది. ఒత్తిడితో కూడా నిరుద్యోగులు మంచి ఆహారం, ఈ కొబ్బరి పువ్వులను తినడం శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉంటారు. షుగర్ ఉన్నవారు ప్రతిరోజు తీసుకోవడం వల్ల షుగర్ కంట్రోల్ చేస్తుంది. థైరాయిడ్ ఉన్నవారికి మంచి మందుగా ఉపయోగపడుతుంది. క్యాన్సర్ కణాలను నాశనం చేసి క్యాన్సర్ రాకుండా దోహదం చేస్తుంది. మృతకణాలను నాశనం చేసి చర్మ సౌందర్యాన్ని పెంచుతుంది. జుట్టు కుదుళ్లకు పోషకాలు అంది జుట్టు రాలడాన్ని అరికట్టి, పొడవుగా పెరగడానికి దోహదపడుతుంది. చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించి మంచి కొలెస్ట్రాల్ వృద్ధి చెంది ఎల్లప్పుడూ గుండెను ఆరోగ్యంగా ఉండేలా దోహదం చేస్తుంది. ఈ పువ్వు తినడం ద్వారా ఇంకా అనేక ఉపయోగాలు ఉన్నాయి. ప్రతిరోజూ తినడంతో కిడ్నీలను శుభ్రపరిచి రాళ్లు ఏర్పడకుండా చేస్తుంది.

ఇతర ప్రాంతాలకు ఎగుమతి...

అంబాజీపేట పరిసర ప్రాంతాల్లోని వ్యాపారులు ఈ కొబ్బరి పువ్వులను ఆర్డర్లు బట్టి అందిస్తారు. వీటి తెల్లవారుజామున రైతుల నుంచి ఇతర ప్రాంతాలకు తరలిస్తారు. ఇవి ఎక్కువ రోజులు నిల్వ ఉండవు. దీంతో వ్యాపారులు అవసరాలకు అనుగుణంగా ఆయా రైతులకు ఆర్డర్లు అందిస్తారు. హైదరాబాద్, కాకినాడ, అమలాపురం, తాడేపల్లిగూడెం, భీమవరం, తణుకు, విజయవాడ, నిడదవోలు తదితర ప్రాంతాలకు వీటిని ఎగుమతులు చేస్తారు. కొబ్బరి పువ్వులు సైజలను బట్టి ధర నిర్ణయిస్తారు. రైతుల వద్ద కొబ్బరి పువ్వు రూ.2 నుంచి రూ.5 వరకు కొనుగోలు చేస్తారు. వాటిని స్థానిక వ్యాపారులు మార్కెట్‌లో రూ.10 నుంచి 15 వరకు విక్రయిస్తున్నారు. ఇతర ప్రాంతాల్లో అయితే రూ.25పైబడే విక్రయిస్తున్నారు.



పోషకాలు అధికం..

కొబ్బరి పువ్వులో 66 శాతం కార్బోహైడ్రేట్లు, 64 శాతం సాల్యుబుల్ షుగర్స్ ఉంటాయి. ఫైబర్‌తోపాటు మినరల్స్ న్యూటియెంట్లు, యాంటీ బయాటిక్స్ ఉంటాయి. ఆరోగ్యకరంగా ఉండేందుకు ఈ కొబ్బరి పువ్వులు తినడం మంచిదే. పోషకాలు కలిగిన ఈ కొబ్బరి పువ్వును తినడం ద్వారా కొన్ని వ్యాధులు దూరం అవుతాయి. **- డాక్టర్ ఎన్‌బీవీ చలపతిరావు, డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన పరిశోధన కేంద్ర అధిపతి, అంబాజీపేట**



ప్రస్తుతం మంచి డిమాండ్ ఉంది..

సీజనల్‌గా దొరికే కొబ్బరి పువ్వులకు ప్రస్తుతం మంచి డిమాండ్ ఉంది. ఇతర ప్రాంతాల నుంచి ఆర్డర్లు రావడంతో ఎగుమతి చేస్తున్నాం. అలాగే ఈ ప్రాంతంలో వీటిపై ఇష్టంగా ఉన్నవారు కొనుగోలు చేసుకుని తీసుకుని వెళుతున్నారు. గతంలో ఈ కొబ్బరి గుడ్లను ఉచితంగా అందించేవాళ్లం. అయితే ప్రస్తుతం వీటికి డిమాండు ఎక్కువగా ఉండడంతో ఇతర ప్రాంతాలకు తరలించి విక్రయాలు చేపడుతున్నాం. **- సుదాబత్తుల వెంకటరామకృష్ణ, వ్యాపారి, అంబాజీపేట**

ఐపీఎల్‌లో గోగన్నమఠం కుర్రోడు

రూ.30 లక్షల రేటు పలికిన సత్యనారాయణరాజు.. అంతటా హర్షాతిరేకాలు



సత్యనారాయణరాజు

ఐపీఎల్‌కు ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు. ఏ చిన్న అప్‌డేట్ వచ్చినా అది క్రీడాభిమానులకు అది పండగలాంటిదే. అందులోనూ ఐపీఎల్ సీజన్‌లో ఎవరు ఏ జట్టు తరపున ఆడతారోనన్నది తీవ్ర ఉత్కంఠ కలిగించే అంశం. అలాంటిది మన కోనసీమ కుర్రాడొకడు ఐపీఎల్‌కు ఎంపికవడం ఎంత పెద్ద విషయం మరి. మామిడికుదురు మండలం గోగన్నమఠం గ్రామానికి చెందిన పెన్మెత్స వెంకట సత్యనారాయణరాజు ఐపీఎల్ వేలంలో రూ.30 లక్షల పలికి ముంబై ఇండియన్స్‌లో చోటు సంపాదించేశాడు. దీంతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని క్రికెట్ అభిమానులంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ గోదావరి జిల్లా కుర్రాడి ఆట కోసం అంతా ఎదురుచూస్తున్నారు.

కాకినాడఅర్బన్/మామిడికుదురు,నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆ సోదరులిద్దరికీ చిన్నప్పటి నుంచి క్రికెట్ అంటే పిచ్చి. ఎలాగైనా సరే ఆటలో అదరగొట్టాలన్నదే వారి టార్గెట్. అందుకు అనుగుణంగా తల్లిదండ్రుల ప్రోత్సాహం, శిక్షకుల సహకారం క్రికెట్‌లో వారు రాణించేందుకు తోడ్పడ్డాయి. ఐపీఎల్ వేలంలో రూ.30 లక్షలు దక్కించుకుని ముంబై ఇండియన్స్‌లో చోటు సంపాదించిన ఆటగాడు పెన్మెత్స వెంకట సత్యనారాయణరాజు ఈ సోదరుల్లో ఒకరు. అతనితోపాటు సోదరుడు పాండురంగ రాజు క్రికెట్‌లోనే రాణిస్తున్నాడు. పలు రంజీ ట్రోఫీల్లోనూ ఇతనూ పాల్గొన్నాడు. ఐపీఎల్‌లో చోటు సంపాదించుకున్న వెంకట సత్యనారాయణరాజు తండ్రి పెన్మత్స రమేష్‌రాజు స్వగ్రామం అంబేద్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం గోగన్నమఠం. దాంతో సత్యనారాయణరాజు ప్రాథమిక విద్యాభ్యాసం స్థానికంగానే ఓ ప్రైవేటు స్కూలులో జరిగింది. తదనంతరం కుటుంబం హైదరాబాద్‌లో స్థిరపడింది. తమ పిల్లల అభీష్టం మేరకు పదో ఏట నుంచే అన్నదమ్ములకు రమేష్‌రాజు క్రికెట్‌లో శిక్షణ ఇప్పించారు. అక్కడ క్రికెట్‌లో ఓనమాలు నేర్చుకుని తమ ప్రస్థానాన్ని మళ్లీ కోనసీమ నుంచి ప్రారంభించారు. అంబాజీపేటలోని క్రికెట్ సబ్‌సెంటర్‌లో ఈ సోదరులు మూడు సంవత్సరాలు శిక్షణ తీసుకున్నారు. తర్వాత ఉద్యోగరీత్యా రమేష్‌రాజు కాకినాడలో స్థిరపడడంతో కాకినాడలోని జిల్లా క్రికెట్ అసోసియేషన్ సెంటర్‌లో వీరిద్దరూ శిక్షణ పొంది రాటుదేలారు. అక్కడి నుంచి అండర్-14 నుంచి అండర్-19 వరకు జిల్లా, రాష్ట్రస్థాయిలో క్రికెట్ పోటీల్లోను, అండర్-23 నుంచి అండర్-25 వరకు రాష్ట్రస్థాయి పోటీల్లోను, ఆంధ్రా రంజీ ట్రోఫీల్లో పాల్గొని వీరు ప్రతిభ కనబరిచారు. ఇక ఇంటర్ వరకు ఆదిత్యలో చదివిన సత్యనారాయణ రాజు ఎస్ఆర్ఎంలో ఎంబీఏ పూర్తిచేశారు. క్రీడా కోటాలో ప్రభుత్వ ఉద్యోగం సాధించాలన్న ధ్యేయంతో ఉండగా, ఆంధ్రా ప్రీమియల్ లీగ్‌లో గోదావరి టైటాన్స్ తరపున పాల్గొని ఇప్పుడు ఏకంగా ఇండియన్ ప్రీమియర్ లీగ్ ముంబై జట్టుకు ఎంపికయ్యాడు. గతంలో తన వద్ద శిక్షణ తీసుకుని జాతీయస్థాయి పోటీలకు ఎంపికవ్వడంపై ఏసీఏ కోచ్ మట్టా సత్తిబాబు ఆనందం వ్యక్తం చేశారు. అటు డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న రాజు తమ్ముడు పాండురంగరాజు కూడా క్రికెట్‌లో మరింత రాణించాలనుకుంటున్నాడు. ఇటు ఫాస్ట్‌బౌలర్‌గా సత్యనారాయణరాజు ఆట కాకినాడ క్రికెట్ అభిమానులకు సుపరిచితమే. ఐపీఎల్ వేలం పాటలో గోగన్నమఠం గ్రామానికి చెందిన సత్యనారాయణరాజును ముంబై ఇండియన్స్ దక్కించుకోవడంతో స్వగ్రామంలోను, ఇటు కాకినాడ నగరం లోనూ హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామీణ ప్రాంతం నుంచి జాతీయ స్థాయికి ఎదిగిన రాజుకు అభినందనలు తెలియజేస్తున్నారు. కాగా తమ కుమారులను ఎంతగానో ప్రోత్సహించిన క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి సత్యనారాయణ, రహీంలకు ఈ సందర్భంగా తండ్రి రమేష్‌రాజు కృతజ్ఞతలు తెలియజేశారు.



ఏసీఏ కోచ్ సత్తిబాబుతో సత్యనారాయణరాజు (ఫైల్)



తల్లిదండ్రులతో సోదరులు







ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయగోపురాన్ని తాకిన సూర్యకిరణాల దృశ్యాలు

సుదర్శన చక్రంపై సూర్యకిరణాలు

ఆత్రేయపురం, నవంబరు26(ఆంధ్రజ్యోతి): భానుడు ప్రకాశిస్తున్న వేళ సుదర్శన చక్రంపై సూర్యకిరణాలు ప్రతిబింబించిన దృశ్యాలు అపురూపం. డాక్టర్‌బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ రాజగోపురంపై మంగళవారం భానుడు ఉదయిస్తున్న వేళల్లో గోపురం సుదర్శన చక్రంపై సూర్యకిరణాలు పడుతున్న దృశ్యం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ దృశ్యాలు భక్తులు సెల్‌ఫోన్లలో బంధించారు.

వైభవంగా లక్ష దీపోత్సవం

● తరలివచ్చిన అశేష భక్తజనం

ఆత్రేయపురం, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం ర్యాలిలో మంగళవారం రాత్రి లక్ష దీపోత్సవ కమిటీ ఆధ్వర్యంలో లక్షదీపోత్సవం వైభవంగా నిర్వహించారు. జగన్మోహిని కేశవస్వామి, ఉమాకమండలేశ్వరస్వామి ఆలయాలకు అభిముఖంగా వరుస దీపాలతో అలంకరణ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉమాకండలేశ్వరస్వామికి రుద్రాభిషేకం, జగన్మోహిని కేశవస్వామికి పుష్పాభిషేకం నిర్వహించారు. ఆయా ఆలయాలకు అభిముఖంగా వరుస దీపాలతో అలంకరించారు. వివిధ రంగుల దీపాలతో దేవత స్వరూపాల దీపాలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. వేలాదిగా తరలివచ్చిన భక్తులు హరిహరనామం జపిస్తూ దీపాలను వెలిగించారు. శివుడు, కృష్ణుడు, కేశవస్వామి, తదితర రూపాలతో దీపాలంకరణ భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. అశేషభక్తజనం భక్తిశ్రద్ధలతో లక్షదీపోత్సవంలో పాల్గొని తన్మయత్వం పొందారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.









ర్యాలి జగన్మోహిని కేశవస్వామి- ఉమాకమండలేశ్వరస్వామి ఆలయాల వద్ద లక్షదీపోత్సవం దృశ్యాలు

వైభవంగా కార్తీక దీపారాధన

● ఉష్ట్ర వాహనంపై స్వామివారి నగరోత్సవం ● ఉర్రూతలూగించిన జబర్దస్త్ కళాకారులు



ఉష్ట్రవాహనంపై ఊరేగుతున్న ప్రసన్నాంజనేయుడు

ద్రాక్షారామ, నవంబరు26(ఆంధ్రజ్యోతి): ద్రాక్షారామలో 61వ కార్తీకదీపారాధన మహోత్సవం మంగళవారం వైభవోపేతంగా జరిగింది. ఉదయం 6 గంటలకు జుత్తుక చిన్న ఆధ్వర్యంలో ప్రసన్నాంజనేయస్వామికి వేదమంత్రాలతో లక్షతులసి పూజ, తమలపాకుల పూజ జరిపారు. స్వామివారిని పంచామృతాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. లక్షతులసి పూజలో పుణ్యదంపతులు పాల్గొని పూజలు నిర్వహించారు. రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్ స్వామివారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

ఉష్ట్రవాహనంపై నగరోత్సవం

అనంతరం మధ్యాహ్నం ప్రసన్నాంజేయస్వామి వారికి పుష్పాలంకృతమైన ఉష్ట్ర వాహనంపై మేళతాళాలు, మంగళవాయిద్యాలతో నగరోత్సవం జరిగింది. నియోజకవర్గ వైసీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాష్ నగరోత్సవం ప్రారంభించారు. ఉష్ట్రవాహనంపై ప్రసన్నాంజనేయస్వామి ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం 4నుంచి 5గంటల వరకు అక్కిరెడ్డి అబ్బు బృందంచే భజన కాలక్షేపం జరిపారు.

జ్యోతిప్రజ్వలన చేసిన ఎమ్మెల్సీ తోట

సాయంత్రం 5.24 గంటలకు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, సూర్యకుమారి దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్తీక దీపారాధన ప్రారంభించారు. అఖండ దీపాన్ని తోట దంపతులు వెలిగించారు. అంతకుముందు ప్రసన్నాంజనేయస్వామికి పూజలు జరిపారు. తదుపరి సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన ప్రారంభించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

కార్తీకదీపారాధన మహోత్సవంలో యాంకర్ నందిని వ్యాఖ్యానంతో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శన ఆకట్టుకుంది. శుభమ్ ఈవెంట్స్‌చే నిర్వహించిన సినీ సంగీత విభావరిలో గాయనీగాయకులు శ్రీలలిత, సత్య, సిద్దూరాక్‌స్టార్ ఆలపించిన సినీగేయాలు అలరించాయి. జబర్దస్త్ కళాకారులు రైజింగ్‌రాజు, రాజమౌళి, హరిత, దొరబాబులచే హాస్యసన్నివేశాల ప్రదర్శనలు హాస్యపు జల్లు కురిపించాయి. ప్రేక్షకులు ఆసక్తిగా తిలకించారు. రాత్రి 12 గంటలకు ఉమాశ్రీ కళానికేతన్‌చే కళాకారులు ప్రదర్శించిన రామాంజనేయ యుద్ధం వార్‌సీను, రాజనర్తకి నాటకం రంగస్థలనాటక ప్రియులు ఆసక్తితో తిలకించారు.



సినీ గీతాలు ఆలపిస్తున్న గాయకురాలు శ్రీలలిత



ప్రసన్నాంజనేయుడికి పూజలు చేస్తున్న మంత్రి సుభాష్



దీపారాధన ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

బాణసంచా మెరుపులు

కార్యక్రమంలో భాగంగా రాత్రి 10 గంటలకు ఆంజనేయ ఫైర్‌వర్క్సు దవులూరి శ్రీనివాస్‌చే బాణా సంచా వినియోగం విశేషంగా అలరించింది. వివిధరకాల బాణాసంచా మెరుపులను వీక్షకులను మైమరిపించాయి. రామచంద్రపురం డీఎస్పీ రామకృష్ణ పర్యవేక్షణలో సీఐ దొరైరాజు పలువురు ఎస్ఐలు, ఏఎస్ఐలు, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.

సైన్సు మ్యూజియంను సందర్శించిన ఏపీ క్రాఫ్ట్ మెంబర్స్ సెక్రటరీ

రాజమహేంద్రవరం రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): బొమ్మూరులో నూతనంగా నిర్మించిన సైన్సు సెంటర్‌ను మంగళవారం ఏపీ కాస్ట్ మెంబర్ సెక్రటరీ చలపతిరావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సైన్సు మ్యూజియం పెండింగ్‌లో ఉన్న పనులన్నీ త్వరగా పూర్తి చేయాలన్నారు. విద్యార్థులకు నూతన ఆవిష్కరణలు చేయడానికి ఇక్కడ అవకాశం కల్పిస్తామన్నారు. విద్యార్థులు, సామాన్య ప్రజానీకం సైన్సు మ్యూజియంను సందర్శించి ఉత్సాహంగా వినోదభరితంగా గడపవచ్చని అందుకు తగిన సౌకర్యాలు ఉన్నాయని ప్రాజెక్టు కోఆర్డినేటర్ మేకా సుసత్యరేఖ తెలిపారు. కార్యక్రమంలో ఎడ్యుకేషనల్ అసిస్టెంట్ కోమలి, కీర్తి, ఫీల్డ్ ఆఫీసర్ దుర్గయ్య టెక్నిషియన్ అజయ్ పాల్గొన్నారు.

అంతర్వేది మినీ ఫిషింగ్ హార్బర్‌లో కోనం చేపలు

● కార్తీకమాసంతో ధరలేక మత్స్యకారులు డీలా

అంతర్వేది, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): కోనసీమ అంబేద్కర్ జిల్లా సఖినేటిపల్లి మండలం అంతర్వేది మినీ ఫిషింగ్ హార్బర్‌లో కోనం చేపలు అధిక సంఖ్యలో లభ్యమయ్యాయి. మత్స్యకారులు పంటపండిన కార్తీక మాసం కావడంతో సరైన గిరాకీ లేకుండాపోయింది. దీంతో కోనం చేపలకు సరైన ధర లేకపోవడంతో మత్స్యకారులు తక్కువ ధరకే విక్రయించారు. గతంలో కిలో రూ.600 నుంచి 700వరకు ఉండేది. ప్రస్తుతం రూ.450కిలో కోనం చేపలు అమ్ముడు పోతున్నాయి. ఈ సీజన్లో ఈ కోనం చేపలు అధికంగా మత్స్యకారుల వలలో చిక్కుతున్నాయని వారు చెబుతున్నారు.





ప్రధాన ఆలయం వెలుపల దర్శనం కోసం వేచివున్న భక్తులు

రత్నగిరిపై కొనసాగిన రద్దీ

అన్నవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుని సన్నిధిలో కార్తీకమాస రద్దీ మంగళవారం కూడా కొనసాగింది. బహుళ ఏకాదశి సందర్భంగా 5,996 వ్రతాలు జరగ్గా వివిధ విభాగాల ద్వారా సుమారు రూ.66 లక్షల ఆదాయం వచ్చిందని అధికారులు వెల్లడించారు. కార్తీకమాసం మరో నాలుగు రోజుల్లో ముగియనుంది. వ్రతాలు మంగళవారం 1.28 లక్షలకు చేరుకోగా కార్తీకం ముగిసేనాటికి మరో 12 వేలు జరుగుతాయని అంచనా వేస్తున్నారు.



ఉప్పాడ వద్ద సముద్రంలో ఎగసిపడుతున్న అలలు

ఉప్పాడ తీరంలో అలజడి

కొత్తపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఉప్పాడ తీరంలో బలమైన ఈదురుగాలులు వీస్తున్నాయి. సముద్ర నీటిమట్టం పెరగడంతో అలలు ఉవ్వెత్తున ఎగసి ఉప్పాడ-కాకినాడ బీచ్‌రోడ్డును తాకుతున్నాయి. ఉప్పాడ-అమీనబాద్‌లో నిర్మాణంలో ఉన్న మినీ హార్బర్ ప్రాంతంలో సముద్రం లోపలికి నిర్మించిన గోడలపై నుంచి రాకాసి అలలు ఎగసిపడుతున్నాయి. మంగళవారం మధ్యాహ్నం నుంచి ఆకాశంలో మబ్బులు ఆవరించాయి. సాయంత్రమయ్యేసరికి గాలుల తీవ్రత పెరిగింది. ఆకాశంలో మబ్బులు, ఈదురు గాలుల తీవ్రతను అంచనా వేసుకున్న మత్స్యకారులు వేట సామగ్రిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

సేవల్లో ప్రథమం



నిర్వహణలో చింతూరు సీహెచ్‌సీకి రాష్ట్రంలో మొదటి స్థానం వరించిన కాయకల్ప అవార్డు రూ.5 లక్షల రివార్డు కూడా...

చింతూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాయకల్ప ప్రోగ్రాం మార్గదర్శకాలు పాటించడంలో అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు సామాజిక ఆరోగ్య కేంద్రం రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచింది. కేంద్ర ప్రభుత్వం 2015 మే 15న ప్రవేశపెట్టిన కాయకల్ప ప్రోగ్రామ్‌ని రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్నాయి. ఆసుపత్రుల నిర్వహణలో నూతనోత్తేజం నింపడమే ఈ కార్యక్రమ ముఖ్యోద్దేశం. కేంద్ర, రాష్ట్ర వైద్య నిపుణుల బృందం నిర్దేశిత కాలంలో ఆసుపత్రులను సందర్శించి పనితీరును అనుసరించి అవార్డులు, రివార్డులు ప్రకటిస్తుంది. 2023-24లో రాష్ట్రంలోని 173 సామాజిక ఆరోగ్య కేంద్రాలకు నిర్వహించింది. రోగుల సంతృప్తి, మెరుగైన వైద్య సేవలు, పారిశుధ్యం అంశాల్లో చింతూరు సీహెచ్‌సీ 97.86 మార్కులు సాధించి రాష్ట్రంలో మొదటి స్థానంలో నిలిచినట్టు రాష్ట్ర పభుత్వం మంగళవారం ప్రకటించింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం చింతూరు సామాజిక ఆరోగ్య కేంద్రానికి ప్రోత్సాహంగా రూ.5 లక్షల రివార్డును ప్రకటించింది. అవార్డు దక్కించుకున్న చింతూరు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎంవీ కోటిరెడ్డిని సహచర వైద్యులు అభినందించారు.



సూపరింటెండెంట్ కోటిరెడ్డికి అభినందనలు తెలుపుతున్న సహచర వైద్యులు

భర్త రిటైర్మెంట్ సొమ్ము కోసం

భార్యల గొడవ

రెండో భార్య ఇంటి ముందు మొదటి భార్య నిరసన



రెండో భార్య ఇంటి ముందు ఆందోళనకు దిగిన మొదటి భార్య, పిల్లలు

గొల్లప్రోలు రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భర్త రిటైర్మెంట్ సొమ్ము కోసం ఇద్దరు భార్యల మధ్య గొడవ జరిగింది. రెండో భార్య ఇంటి ఎదుట మొదటి భార్య ప్లిలలతో కలిసి నిరసనకు దిగిన సంఘటన కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం చేబ్రోలులో జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి... బత్తిన అప్పారావు అనే వ్యక్తి చేబ్రోలు లో సెరికల్చర్ కార్యాలయంలో ఉద్యోగం చేస్తూ గత ఏడాది ఉద్యోగ విరమణ చేశాడు. రిటైర్మెంట్ సొమ్ము రూ.38లక్షలు రావాల్సి ఉంది. కాగా అప్పారావు తొలుత లక్ష్మిని, తర్వాత ఆయన చేస్తున్న కార్యాలయంలో టెక్నికల్ అసిస్టెంట్ రాజేశ్వరిని రెండో పెళ్లి చేసుకున్నాడు. కాగా రావాల్సిన సొమ్ము కోసం రెండు కుటుంబాల మధ్య ఏడాదిగా వివాదం జరుగుతోంది. పెద్దల మధ్య పెట్టినా సమస్య పరిష్కారం కాలేదు. రిటైర్మెంట్ సొమ్ము తమకే కావాలని, తండ్రిని తమకు అప్పగించాలని మొదటి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు రెండో భార్య రాజేశ్వరి పని చేస్తున్న కార్యాలయానికి వెళ్లి వాగ్వాదానికి దిగారు.

అనంతరం రాజేశ్వరి ఇంటికి వెళ్లి టెంట్ వేసి నిరసనకు దిగారు. మరోపక్క రెండో భార్య రాజేశ్వరి, భర్త అప్పారావు కలిసి గొల్లప్రోలు పోలీసు స్టేషన్‌కు వెళ్లి మొదటి భార్య, ఆమె ఇద్దరు పిల్లలు దాడి చేశారని ఫిర్యాదు చేశాడు. అప్పారావు తన మోటారు సైకిల్ తీసుకెళ్లిపోయారని పోలీసులకు ఫిర్యాదు చేశారు. అదనపు ఎస్ఐ లక్ష్మణస్వామి కేసు విచారిస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ముగ్గురికి తీవ్ర గాయాలు... పిఠాపురం బైపాస్‌లో ఘటన

పిఠాపురం రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా పిఠాపురం బైపాస్‌లో మంగళవారం సాయంత్రం జరిగిన ప్రమాదంలో ఒక వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. పిఠాపురం మండలం చిత్రాడ గ్రామానికి చెందిన పెట్ల దుర్గాప్రసాద్ (22) బంగారం పని చేస్తుంటాడు. మంగళవారం ఆయన భార్య సమత, తల్లి సాయికుమారి, రెండేళ్ల పాపతో కలిసి మోటారు సైకిల్‌పై గొల్లప్రోలు మండలం తాటిపర్తి అపర్ణాదేవి ఆలయానికి వెళ్లారు. తిరిగి వస్తుండగా పిఠాపురం జాతీయ రహదారి సీతయ్యగారి తోట సమీపంలో ముందు వెళ్తున్న గుర్తు తెలియని వాహనాన్ని ఢీకొన్నాడు. దాంతో కిందపడిపోయిన దుర్గాప్రసాద్ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్ర గాయాలైన ముగ్గురినీ తొలుత పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి అక్కడి నుంచి కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. పట్టణ ఎస్ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బైపాస్ రోడ్డులో ప్రమాద స్థలిలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు





నీలకంఠేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న విధు శేఖర భారతీ మహాస్వామి, భక్తులకు అనుగ్రహభాషణ

భగవత్ సంకల్పంతోనే కార్య సిద్ధి

శృంగేరీ పీఠాధిపతి విధు శేఖర భారతీ మహాస్వామి

అంతర్వేది లక్ష్మీనరసింహ స్వామి దర్శనం

నరసింహ జయంతి కైంకర్యాలకు రూ.1,11,116 విరాళం

అంతర్వేది, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భగవంతుని సంకల్పంతోనే ప్రతీ కార్యం సిద్ధిస్తుందని శృంగేరీ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ మహాస్వామి అన్నారు. దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న అంతర్వేది పుణ్యక్షేత్రానికి మంగళవారం ఆయన విచ్చేశారు. రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, ఆలయ అధికారులు, అర్చకులు, గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. అంతర్వేది సముద్ర తీరంలో పుణ్యస్నానం ఆచరించిన స్వామి తొలి దర్శనంగా క్షేత్రపాలకుడు నీలకంఠేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆలయ ప్రదక్షిణ చేసి పురాతన కట్టడమైన శివాలయం, ధ్వజస్తంభం, బ్రిటీష కాలం నాటి నందీశ్వరుడిని పరిశీలించారు. నీలకంఠేశ్వరస్వామికి పంచామృతాలతో అభిషేకం చేశారు. ఆలయ పునర్నిర్మాణం గురించి అర్చకులు, సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ స్వామీజీకి వివరించారు. అనంతరం లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి చేరుకున్న మహాస్వామికి వేద పండితులు, అర్చకులు, అధికారులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. ఆలయ ప్రదక్షిణ చేస్తూ ప్రాకార మండపంలో ఉన్న దేవతలను దర్శించుకుంటూ ఆలయ ప్రాకారం, గోపురాల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం శిష్యులతో కలిసి అంతరాలయంలో స్వామిని దర్శించుకున్నారు. ఆలయ విశిష్టత, చరిత్రలను అర్చకులు వివరించారు. రాజ్యలక్ష్మి అమ్మవారిని దర్శించారు. ఆలయ అభివృద్ధి, భక్తుల కోసం నిర్మించబోయే అన్నదాన భవనం, కోనేరు, మాస్టర్‌ప్లాన్ గురించి అధికారులు, అర్చకులను అడిగి తెలుసుకున్నారు. తదనంతరం భక్తులకు అనుగ్రహభాషణ చేశారు. మానవుని మనసులో ఏముందో, వారు చేసే పనుల్లో తప్పు ఒప్పులను మరొకరు తెలుసుకోవడం కష్టమే కానీ భగవంతుడు సర్వలోకాన్ని క్షణాల్లో తెలుసుకుంటాడన్నారు.సంకల్పం గొప్పదైతే ఏ కార్యాన్నైనా జయించడానికి భగవంతుడు మీ వెంటే ఉంటాడన్నారు. దైవ కార్యాల్లో పాల్గొనడం ప్రతి ఒక్కరి వల్ల కాదని, భగవంతుడు అనుగ్రహిస్తేనే తప్ప దైవ దర్శనం జరగదన్నారు. పశ్చిమ ముఖ దిశగా దర్శనమిస్తున్న లక్ష్మీనరసింహ స్వామి ఎల్లప్పుడూ మీ వెంటే ఉంటూ మీకు ఆశీస్సులు అందజేస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ ధర్మం వైపు నడుచుకుంటూ ఆధ్యాత్మిక భావాలను అలవరచుకోవాలన్నారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామి అనుగ్రహభాషణతో పులకించిపోయారు. అనంతరం భారతీమహాస్వామికి ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ ఆలయ అభివృద్ధి, పురాతన కట్టడాల గురించి వివరించారు. రాజోలు నియోజకవర్గ ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సిఫార్సు చేయాలని కోరారు. లక్ష్మీనరసింహస్వామి జయంతికి కైంకర్యాల కోసం రూ.1,11,116 విరాళాన్ని ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణకు అందించారు.

కార్యక్రమంలో ఆలయ ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్, ఛైర్మన్ రాజా కలిదిండి కుమారరామగోపాలరాజా బహదూర్, దేవదాయ శాఖ తనిఖీ అధికారి రామలింగేశ్వరరావు, రాష్ట్ర మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల నరసింహారావు (పెద్దకాపు), ఎంపీటీసీ భైరా నాగరాజు, పోతురాజు కృష్ణ, బర్రే శ్రీను, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం భారతి మహాస్వామి తిరుగు ప్రయాణంలో గుడిమెళ్లంక అల్లూరి విశ్వనాథరాజు నివాసం, వేణుగోపాలస్వామి, కనకదుర్గమ్మ ఆలయాలను దర్శించి పాలకొల్లు శంకర మఠానికి వెళ్లారు. సాయంత్రం చంద్రమౌళీశ్వర పూజ, అనంతరం భక్తులు పాద పూజ చేసి వస్త్రాలు, కానుకలు సమర్పించారు. అనంతరం రాజమహేంద్రవరం పయనమయ్యారు.





అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో విధు శేఖర భారతీ మహాస్వామి, ఎమ్మెల్యే దేవ వరప్రసాద్‌తో మాట్లాడుతున్న దృశ్యం

వైద్యం వికటించా! గుండెపోటా!

ప్రైవేట్ ఆసుపత్రిలో ఆపరేషన్‌కు వెళ్లిన వ్యక్తి మృతిపై పలు అనుమానాలు

గండేపల్లి, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ముక్కు శస్త్ర చికిత్స కోసం ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లిన వ్యక్తి కొన్ని నిమిషాల్లోనే మృతి చెందిన సంఘటన కాకినాడ జిల్లా గండేపల్లి మండలం నీలాద్రిరావుపేట గ్రామ శివారున ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో మంగళవారం చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. జగ్గంపేట మండలం సీతారాంపురం గ్రామానికి చెందిన చింతల శ్రీను (40) ఈ నెల 21న రాజపూడి వద్ద బైక్ ఢీకొనడంతో గాయాలపాలయ్యాడు. దీంతో అతడిని నీలాద్రిరావుపేట గ్రామ శివారున ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించారు. అయితే ముక్కుకి గట్టి దెబ్బ తగలడంతో అక్కడి వైద్యులు శస్త్ర చికిత్స అవసరమని చెప్పారు. అప్పటి నుంచి అదిగో ఇదిగో అంటూ మంగళవారం ఆపరేషన్ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. మంగళవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో శ్రీనును ఆపరేషన్ థియేటర్‌లోకి తీసుకెళ్లి మత్తు ఇవ్వగా కొద్దిసేపటికే మృతిచెందినట్టు సమాచారం. సాయంత్రం ఆసుపత్రి సిబ్బందిని శ్రీను బంధువులు ఆపరేషన్ ఏమైందని అడగ్గా గుండెపోటుతో మృతి చెందినట్టు తెలిపారు. దీంతో శ్రీను కుటుంబీకులు ఒక్కసారిగా కుప్పకూలారు. ప్రమాదం జరిగి ఆసుపత్రిలో చేరినప్పటి నుంచి కూడా శ్రీను బాగానే ఉన్నప్పటికీ ఆపరేషన్ థియేటర్‌లోకి వెళ్లగానే చనిపోవడంపై స్థానికులు పలు ఆరోపణలు చేశారు. వైద్యం వికటించిందా... లేక నిజంగానే గుండెపోటు వచ్చిందా అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై ఆసుపత్రి యాజమాన్యం వివరణ కోరడానికి ప్రయత్నించగా ఎవరూ అందుబాటులో లేకపోవడం చర్చనీయాంశంగా మారింది.



ఆసుపత్రిలో రోదిస్తున్న బంధువులు, ఇన్‌సెట్‌లో మృతుడు శ్రీను పాత చిత్రం

రోడ్డు ప్రమాదంలో ఒడిశా వాసి మృతి

శంఖవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కత్తిపూడి శివారు సీతంపేట 16వ నెంబరు రహదారిపై మంగళవారం తెల్లవారుజామున జరిగిన ప్రమాదంలో ఒడిశాకు చెందిన జన సురేష్‌కుమార్ (32) మృతి చెందాడు. అన్నవరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఒడిశా రాష్ట్రం రాయగడకు చెందిన కుమార్ ఒడిశా నుంచి రాజమహేంద్రవరం వైపు లారీ నడుపుకుంటూ వెళ్తున్నాడు. కత్తిపూడి సమీపంలో ఆగి ఉన్న లారీని ఢీకొనడంతో లారీ నుజ్జునుజ్జయ్యింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సురేష్‌కుమార్ అక్కడికక్కడే మృతి చెందాడు. అన్నవరం ఎస్ఐ శ్రీహరిబాబు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని తుని ఏరియా ఆసుపత్రికి తరలించారు.



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ శ్రీహరిబాబు

నేడు త్రినాథరావు బాధ్యతల స్వీకారం

అన్నవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): అన్నవరం దేవస్థానం ఈవోగా పూర్తి అదనపు బాధ్యతలపై నియమితులైన వేంద్ర త్రినాథరావు బుధవారం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఉదయం పది గంటలకు రామచంద్ర మోహన్‌కు వీడ్కోలు సభ ఏర్పాటు చేసినట్టు దేవస్థానం ఉద్యోగుల సంఘం ఒక ప్రకటనలో పేర్కొంది.

రైతు కూలీ, ఏజెన్సీ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో

మహా ధర్నా



ఐటీడీఏ గేటు ఎదుట ధర్నా చేస్తున్న రైతు కూలీ, గిరిజన సంఘాల నాయకులు

రంపచోడవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతులు, కార్మికులు, పోలవరం నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యలపై రైతు కూలీ, ఏజెన్సీ గిరిజన సంఘాల ఆధ్వర్యంలో మంగళవారం చేపట్టిన మహా ధర్నా విజయవంతమైంది. రంపచోడవరం ప్రధాన కూడలిలో మానవ హారం జరిపి భారీ ప్రదర్శనతో ఐటీడీఏ, సబ్ కలెక్టర్ కార్యాలయాలను ముట్టడించి పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అధికారులకు అందజేశారు. రైతుకూలీ సంఘం ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా సహాయ కార్యదర్శి వంజం జోగారావు, గిరిజన సంఘం జిల్లా సహాయ కార్యదర్శి తాటి బుల్లబ్బాయి మాట్లాడుతూ రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. బడా కార్పొరేట్లకు కోట్లాది రూపాయలు మాఫీ చేస్తున్న ప్రభుత్వాలు రైతు రుణాల మాఫీలో అలసత్వం వహిస్తున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం పోలవరం నిర్వాసితుల సమస్యలను పట్టించుకోవట్లేదన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలన్నారు. ఆదివాసీ అటవీ హక్కులను పరిరక్షించాలని, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్, డైలీవేజ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలన్నారు. ఉపాధి హామీ పథకం పని దినాలను 200 వందల రోజులకు పెంచాలన్నారు. రైతు కూలీ, ఏజెన్సీ గిరిజన సంఘాల నాయకులు ఈ.రాంబాబు, కె.రామిరెడ్డి, సంజీవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా ధర్నా

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా కలెక్టరేట్ ఎదుట మంగళవారం ధర్నా జరిగింది. సీఐటీయూ జాతీయ ఉపాధ్యక్షురాలు బేబి రాణి, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేశ్వర్లు, ఏపీ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ హమాలీ యూనియన్ అధ్యక్షుడు వీరవెంకటరావు ఉన్నారు.

అఖండ దీపారాధన



పిఠాపురంలో అఖండ దీపారాధన దృశ్యం

పిఠాపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పిఠాపురంలోని సూర్యరాయ విద్యానంద గ్రంథాలయం వద్ద ఆర్‌ఎస్‌ఎస్ ఆధ్వర్యంలో అఖండ భారత్ అనే నినాదంతో దీపారాధన కార్యక్రమం జరిగింది. కార్తీకమాసం సందర్భంగా దీపాలంకరణ ఏర్పాటు చేసినట్లు ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధి సత్య రామచంద్రరావు తెలిపారు. గ్రంథాలయ కార్యదర్శి కొండేపూడి శంకరరావు, రైటింగ్ ప్రసాద్, కౌన్సిలర్లు అల్లవరపు నగేష్, రాయుడు శ్రీను,ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలున్నారు.

నడకుదురులో బియ్యం గొడౌన్లలో తనిఖీలు

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కరప మండలం నడకుదురు గ్రామంలో లవన్ ఇంటర్నేషనల్ ప్రాంగణంలో ఉన్న బియ్యం గొడౌన్లను ఏపీ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్ మంగళవారం తనిఖీలు చేశారు. తెలంగాణ నుంచి ఇక్కడికి వచ్చిన లారీల్లో బియ్యాన్ని పరీక్షించేందుకు అధికారులు శాంపిల్స్ స్వీకరించారు. తెలంగాణ నుంచి నడకుదురు పెద్ద ఎత్తున పీడీఎస్ బియ్యం వస్తుందని సమాచారంతో ఆయన గొడౌన్లపై దాడులు చేశారు. తెలంగాణ నుంచి ఇక్కడికి వచ్చిన లారీలకు వే బిల్లులు కూడా లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈనేపథ్యంలో పెద్దఎత్తున శాంపిల్స్ స్వీకరించి టెస్టింగ్ నిమిత్తం ల్యాబ్ పంపించారు. ఆయన వెంట జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ప్రసాద్, పోలీసు అధికారులు ఉన్నారు.

చెరువుపై ఆక్రమణ తొలగించిన స్థానికులు

పిఠాపురం రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం జల్లూరు గ్రామ చెరువుపై అక్రమణపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం పొక్లెయిన్‌తో తొలగించుకున్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యేగా అనుచరుడిగా పనిచేసిన వ్యక్తి తన ఇంటికి వెళ్లేందుకు అనుకూలంగా చెరువు గట్టును కబ్జా చేసి, రోడ్డు నిర్మించుకున్నాడు. దానిపై అప్పట్లో గ్రామస్తులు పలుమార్లు అధికారులను కలిసి ఫిర్యాదు చేశారు. అప్పట్లో అధికార అండదండలతో అక్రమణ తొలగించలేదు. కాగా ఇటీవల కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత గ్రామస్తులు పీజీఆర్‌ఎస్ కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. డీపీవో పరిశీలన చేసి వెంటనే ఆక్రమణ తొలగించాలని ఆదేశాలు జారీ చేశారు. ఇదే చెరువులో రైతులు పశువులను నీళ్లకు తీసుకెళ్లడం, కార్తీక మాసంలో మహిళలు దీపారాధన చేసుకోవడం, మృతదేహాలను ఈ రోడ్డు నుంచి శ్మశానానికి తీసుకెళ్లేవారు. ఆ మార్గం మూసేయడంతో రైతులు ఇంతకాలం తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎట్టకేలకు మంగళవారం వారే పొక్లెయిన్‌తో ఆక్రమణ తొలగించి చెరువులోకి వెళ్లేందుకు మార్గం ఏర్పాటు చేసుకున్నారు.

మెప్మా సిబ్బందిపై ఫిర్యాదులు

సామర్లకోట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సామర్లకోట మున్సిపల్ మెప్మా కార్యాలయ సిబ్బంది కొందరి డ్వాక్రా సీఆర్‌పీల పట్ల పరుషంగా మాట్లాడుతున్నారని దీనిపై మున్సిపల్ అధికారులు సమగ్ర దర్యాప్తు జరిపి బాధ్యులైన సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని సీఆర్పీలు మున్సిపల్ ఉన్నతాధికారులకు మంగళవారం ఫిర్యాదులు చేశారు. గత కొంతకాలంగా డ్వాక్రా సంఘాల రుణ పంపిణీలో డబ్బులు వసూలు విషయమై 2 వర్గాల మధ్య అంతర్గత వివాదాలు ఉన్నట్లు తెలిసింది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన అనంతరం మెప్మా విభాగంలో పని చేసే కొందరి సిబ్బంది బదిలీ కాగా వారి స్థానాల్లో చేరిన వారు సీఆర్పీలపై దురుసుగా వ్యవహరిస్తున్నారన్న ఫిర్యాదులు మున్సిపల్ అధికారులకు అందాయి. అయితే దీనిపై వివరణ కోరేం దుకు మున్సిపల్ అధికారులను సంప్రదించగా వారు అందుబాటులో లేరు.

సమాజానికి సేవలందించాలి

కాకినాడ సిటీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రతి మనిషిలోని దాన గుణం, సేవా తత్పరత మేల్కొనేలాగ ప్రతి ఒక్కరూ సమాజానికి సేవలందించాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా పూర్వపు లయన్స్ గవర్నర్ మాదిరెడ్డి బాబూజీరావు పేర్కొన్నారు. భారత రాజ్యాంగ వజ్రోత్సవం సందర్భంగా మంగళవారం కాకినాడ విముక్తి కాలనీలోని కుష్టురోగులకు స్టీల్ కంచాలు, గ్లాసులు అందజేసి అన్నదానం చేశారు. కాకినాడ సఖి లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు కొడారి ఉమ అధ్యక్షతన బాబూజీరావు సౌజన్యంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. క్లబ్ సభ్యురాళ్లు బాబూజీరావును శాలువాతో సత్కరించారు. లయన్స్ కాకినాడ జోన్ చైర్మన్ ఓం నమశ్శివాయ, మంగా శివరామకృష్ణ, నూలు నాగలక్ష్మి, కాశి అన్నపూర్ణ, రత్నమాల, రమ జీ, సావిత్రి, లక్ష్మి పాల్గొన్నారు.

కార్తీక వనసమారాధన

కొత్తపల్లి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): మూలపేట తీరంలో ఏపీ, తెలంగాణ ప్రాంతాలకు చెందిన స్నేహం ఫేస్‌బుక్ ఫ్రెండ్స్ గ్రూప్ కార్తీక వనసమారాధన నిర్వహించారు. సుమారు 200 మంది హాజరయ్యారు. ఉసిరి చెట్టుకు పూజలు చేసి ఆడిపాడారు. సాంస్కృతిక కార్యక్రమాలు, సహపంక్తి భోజనాలు జరిగాయి. ముఖ్యఅతిథిగా విచ్చేసిన సినీ నటుడు పీఎస్ గంగాధర్‌ను సభ్యులు ఘనంగా సత్కరించారు.

కార్తీక మాస పూజలు

తాళ్లరేవు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): తాళ్లరేవులో శ్రీభద్రకాళీ భూసమేత వీరేశ్వరాలయంలో అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం అగ్నికుల క్షత్రియ దంపతులు కార్తీక మాస పూజలు చేశారు.

భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలు

అంబేడ్కర్‌కు ఘన నివాళి

ప్రతిజ్ఞలు చేసిన అధికారులు, టీచర్లు





జేఎన్టీయూకేలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పించిన వీసీ, కాకినాడ ప్రతిజ్ఞ చేస్తున్న నగరపాలక సంస్థ సిబ్బంది



జీజీహెచ్: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డీఎంహెచ్‌వో

జేఎన్టీయూకే, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): వర్సిటీలోని సెనేట్ హాల్లో మంగళవారం 75వ భారత రాజ్యాంగ దినోత్సవ వేడుకలను జేఎన్టీయూకే ఎస్సీఎస్టీ లైజనింగ్ అధికారి ఎం.కుమారస్వామి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ, విశిష్ట అతిథిగా విశాఖపట్నంలోని దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్శిటీ ప్రొఫెసర్ డాక్టర్ గంటా సత్యనారాయణ పాల్గొనగా అతిథులు, రెక్టార్ కేవీ రమణ, డైరెక్టర్లు, సిబ్బంది డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. వీసీ మాట్లాడుతూ మన దేశానికి దిక్సూచి భారతరాజ్యాంగమన్నారు. ప్రతీ ఒక్కరూ విద్యార్థి దశ నుంచే రాజ్యాంగంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. అనంతరం సత్యనారాయణ మాట్లాడుతూ 75 ఏళ్ల నుంచి భారతదేశం ఆర్థిక అసమానతలు లేని దేశంగా, సమైక్యంగా ఉండటానికి కారణం భారతరాజ్యాంగమేనన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు, యూసీఈకే ప్రిన్సిపాల్స్, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

జీజీహెచ్: కాకినాడ డీఎంహెచ్‌వో కార్యాలయంలో డీఎంహెచ్‌వో డా.జె.నరసింహనాయక్ ఆధ్వర్యంలో కార్యాలయ ప్రాంగణంలోని డా.బి.ఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. డీఎంహెచ్‌వో మాట్లాడుతూ సమాజంలోని ప్రతి ఒక్కరు అంబేడ్కర్ రచించిన రాజ్యాంగంలోని ప్రతి అంశాన్ని సరైన రీతిలో ముందుకు తీసుకెళ్లేలా కృషి చేయాలన్నారు. డీఐవో డా.కెవి సుబ్బరాజు, పివోఆర్‌బిఎస్‌కె డా.ఐ ప్రభ్కార్, ఇన్‌చార్జ్ డిఎంఓ డా.విజయ కుమార్, డెమో ప్రసాదరాజు పాల్గొన్నారు. కాకినాడ జీజీహెచ్ ప్రాంగణంలోని అంబేడ్కర్ విగ్రహానికి ఆసుపత్రి సూపరిండెంట్ డా.సరెళ్ళ లావణ్యకుమారి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కార్యక్రమంలో సీఎస్‌ఆర్‌ఎంవో డా. కోనాల అనిత, ఆర్థో హెచ్‌వోడి డా.ఎంపిఆర్ విఠల్, ఏడి అనురాధ, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

కాకినాడ రూరల్: ప్రతీ విద్యార్థి భారత రాజ్యాంగం, భారత ప్రజాస్వామ్యం పట్ల గౌరవం కలిగి బాధ్యతాయుతంగా నడుచుకుంటూ దేశానికి మంచి పేరు తీసుకురావాలని అక్కూ ఎంఎస్‌ఎన్ క్యాంపస్ ప్రిన్సిపాల్ ఎం.కమలకుమారి అన్నారు. తిమ్మాపురంలోని ఎంఎస్‌ఎన్ క్యాంపస్‌లో 75వ రాజ్యాంగ దినోత్సవాన్ని పొలిటికల్ సైన్స్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆధ్వర్యంలో కన్వీనర్, కోర్సు సమన్వయకర్త డాక్టర్ కె.జోసెప్ స్టీవెన్ అధ్యక్షతన నిర్వహించారు. ప్రిన్సిపాల్ ముఖ్యఅతిథిగానూ,ముఖ్య వక్తగా విశాఖపట్నం దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివరిటీ ప్రొఫెసర్ గంటా సత్యనారాయణ పాల్గొన్నారు. అంబేడ్కర్ విగ్రహానికి అతిథులు, సిబ్బంది పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్లు నానిబాబు, హరిబాబు, గోపి, మనోజ్ దేవ, పోచయ్య, హారిక విద్యార్థులు పాల్గొన్నారు.

కార్పొరేషన్: కొండయ్యపాలెం శారదమ్మగుడి వద్ద ఉన్న నగరపాలక సంస్థ కార్యాలయ ఆవరణలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, గాంధీజీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగ విలువలు పాటిస్తామంటూ నగరపాలక అధికారులు, ఉద్యోగులు ప్రతిజ్ఞ చేశారు. మేనేజర్ శిరీష్, అకౌంటెండ్ సత్యనారాయణ, అధికారులు, ఉద్యోగులున్నారు.

75 ఏళ్ల భారత రాజ్యాంగం సామాన్యులకు రక్షణ గోడగా తోడు నీడగా నిలిచిందని ఎన్టీఆర్ హెల్త్ యూనివర్శిటీ మాజీ వైస్ చాన్సలర్ డాక్టర్ కె.బాబ్జి అన్నారు. సామాజిక న్యాయ సాధన సమితి, యునైటెడ్ ఎస్సీ, ఎస్టీ ఫోరం ఆధ్వర్యంలో కాకినాడ ఇంద్రపాలెం అంబేడ్కర్ కాంస్య విగ్రహం వద్ద వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ వైస్ ఛాన్సలర్ కె.బాబ్జి, సామాజిక న్యాయ సాధన సమితి అధ్యక్షురాలు డాక్టర్ భానుమతి హాజరై రాజ్యాంగం విశిష్టత, రాజ్యాంగం రచనలో అంబేడ్కర్ కృషి, ప్రస్తుతం రాజ్యాంగం అమలు తీరు వంటి అంశాలపై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు డాక్టర్ మోకా పవన్‌కుమార్, తుమ్మల నూకరాజు, కె.శ్రీనివాస్, భయ్యాకుమార్, టి.పృద్వీరాజ్, మోర్త రాజశేఖర్, కృష్ణమూర్తి, పిట్టా వరప్రసాద్, పలివెల వీరబాబు, ఏనుగుపల్లి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట: రావువారి చంద్రంపాలెం గ్రామంలో దళితవాడ ముందు ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి తహశీల్దార్ చంద్రశేఖరరెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. డిప్యూటీ తహశీల్దార్ వై.శ్రీనివాస్, వీఆర్వోలు ఖాదర్‌వల్లీ, పద్మనాభం పాల్గొన్నారు. సామర్లకోట రైల్వేస్టేషన్లో స్టేషన్ మేనేజరు ఎం.రమేష్ అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

పిఠాపురం: మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు గుబ్బల రాజు ఆధ్వర్యంలో పిఠాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముంజువరపు కృపానందం, బందిలి సూరిబాబు, దడాల సత్తిబాబు, దుగ్గాడ సింహాచలం, కన్నారావు పాల్గొన్నారు. ఆర్ఆర్‌బీహెచ్‌ఆర్ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ కేశవరావు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులతో రాజ్యాంగ దినోత్సవ ప్రమాణం చేయించారు. అధ్యాపకులు కె.రామారావు, ఎన్ఎస్ఎస్‌ప్రోగ్రాం ఆఫీసర్ డి.కాశీవిశ్వనాథం, వి.బుల్లి ప్రసాద్, బి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. అంబేడ్కర్ సెంటర్‌లో వైసీపీ ఇన్‌చార్జి వంగా గీత అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో గండేపల్లి బాబీ, కౌన్సిలర్లున్నారు.

తాళ్లరేవు: గ్రామంలో అంబేడ్కర్ విగ్రహానికి మండల దళిత యునైటెడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పలువురు నేతలు నివాళులర్పించారు. మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారి సత్యనారాయణ రాజ్యాంగం ప్రాముఖ్యతను వివరిస్తూ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో నేతలు జక్కల ప్రసాద్, కాశి లక్ష్మణస్వామి, గంటా రమేష్, గంజా సూరిబాబు, ఎలిపే నాగేశ్వరరావు, టేకుమూడి ఈశ్వరరావు, యేరుపల్లి వీరన్న, ఎంపీటీసీ గుత్తుల శ్రీను, దడాల బుజ్జిబాబు పాల్గొన్నారు.

కొత్తపల్లి: కొత్తపల్లి మండల ప్రజాపరిషత్ అభివృద్ధి కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి అధికారులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కొండెవరం వీఎస్‌ఆర్ జిల్లా పరిషత్ ఉన్నత రాజ్యాంగ దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సత్యారెడ్డి, సూపరిండెంట్ చలమయ్య, మండల ఇంజనీరింగ్ అధికారి జి.శ్రీనివాస్, కొండెవరం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు బీకేవీ చక్రపాణి, ఉపాధ్యాయులు ఉన్నారు.



తాళ్లరేవులో ప్రతిజ్ఞ చేస్తున్న నేతలు



పిఠాపురంలో అంబేడ్కర్ చిత్రపటానికి నివాళి

ఉపాధ్యాయుల వాణి వినిపించేందుకు కృషి

మాజీ ఎమ్మెల్సీ బాలసుబ్రహ్మణ్యం



కరపత్రం ఆవిష్కరిస్తున్న బాలసుబ్రహ్మణ్యం

కాకినాడ సిటీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ శ్రేయస్సు ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణ కోసం నికరంగా నిలబడుతూ, ఉపాధ్యాయ, అధ్యాపకుల వాణి శాసనమండలిలో వినిపించేందుకు పీడీఎఫ్ ఎమ్మెల్సీలు కృషి చేయడం జరుగుతుందని మాజీ ఎమ్మెల్సీ విఠపు బాలసుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. తూర్పు పశ్చిమ గోదావరి జిల్లా ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోటీచేస్తున్న పీడీఎఫ్ అభ్యర్థి బొర్రా గోపిమూర్తికి జన విజ్ఞాన వేదిక మద్దతు ప్రకటించింది. మంగళవారం స్థానిక యూటీఎఫ్ హోంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఇందుకు సంబంధించిన కరపత్రాన్ని బాలసుబ్రహ్మణ్యం ఆవిష్కరించారు. గోపిమూర్తి మాట్లాడుతూ ఉపాధ్యాయ, అధ్యాపకులంతా తనను బలపరిచి గెలిపిస్తే ఫేక్ సాట్లీ స్ఫూర్తితో శాసనమండలిలో రాజీలేని కృషి చేస్తానని తెలిపారు. జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు కేఎంఎంఆర్ ప్రసాద్ మాట్లాడుతూ జేవీవీ నాయకులు, కార్యకర్తలు గోపిమూర్తి విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. బీవీవీ సత్యనారాయణ, యుఎస్ఎన్ రెడ్డి, రామలక్ష్మి, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అర్జీలను వేగంగా పరిష్కరించాలి : ఆర్డీవో

పెద్దాపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రీసర్వే గ్రామసభల్లో వచ్చిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని ఆర్డీవో కట్రెడ్డి శ్రీరమణి అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో డివిజన్ పరిధిలో ఉన్న తహశీల్దార్లతో మంగళవారం ఆమె సమీక్షించారు. పీజీఆర్‌ఎస్, ఫ్రీహోల్డ్ రిపోర్టులు, ఎమ్మెల్సీ ఎన్నికలు తదితర అంశాలపై మాట్లాడారు. ప్రతీ అర్జీని పరిశీలించి పరిష్కరించాలన్నారు. కార్యాలయ ఏవో మాధవరావు, తహశీల్దార్ సీహెచ్.వెంకటలక్ష్మి తదితరులు ఉన్నారు.



తహశీల్దార్లతో సమీక్షిస్తున్న ఆర్డీవో శ్రీరమణి

దివీస్ బాధిత రైతుల ఆందోళన

తొండంగి మండలం తాటియాకుల పాలెంలో ఉన్న దివీస్ బాధిత రైతులు పెద్దాపురం ఆర్డీవో కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. కేఎస్ఈజెడ్ కోసం కోన ఫారెస్ట్ డి పట్టా భూములు సేకరించిందని అందులో సుమారు 505 ఎకరాలు దివీస్ కంపెనీకి కేటాయించిందని, ఆభూముల్లో సన్న చిన్న కారు రైతులు ఉన్నారన్నారు. కంపెనీకి కేటాయించడంతో రైతులు జీవనాధారం కోల్పోయారని, తమకు నష్టపరిహారం ఇవ్వలేదన్నారు. తమ భూములను దివీస్ కంపెనీ తీసుకున్న భూములకు బదులుగా భూమిని కేటాయించాలన్నారు. అలాగే రూ.70 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని, ఎకరానికి ఫలసాయం నష్టపోయినందుకు రూ. లక్ష పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు కుటుంబాలకు చెందిన వారికి కంపెనీలో ఉద్యోగాలు కల్పించాలన్నారు. వృద్ధులకు రూ.20వేలు భృతిని ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆర్డీవో శ్రీరమణికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో తాటపర్తి బాబూరావు, సత్తిబాబు, దండియ్య, గోవిందయ్య తదితరులు పాల్గొన్నారు.

బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని ఢీకొన్న లారీ

అపస్మారక స్థితిలోకి వెళ్లిన వ్యక్తి

కాకినాడ రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం కాకినాడ సూర్యారావుపేట బీచ్‌రోడ్డులో బైక్‌పై వెళ్తున్న వ్యక్తిని లారీ ఢీకొనడంతో ఆ వ్యక్తి తలకు బలమైన గాయం కావడంతో అపస్మారక స్థితిలోకి చేరడంతో కాకినాడ జీజీహెచ్‌కు వైద్యం నిమిత్తం తరలించారు. సర్పవరం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లైట్‌హౌస్ రోడ్డు అదానీ కంపెనీ ఓఎన్‌జీసీ గేటు ఎదురుగా గల రోడ్డులో ఏపీ5టీఏ7733 నెంబరు గల లారీ మంగళవారం రాత్రి ఐస్‌లోడ్‌తో కాకినాడ నుంచి కొత్తపల్లి వెళుతోంది. అదే సమయంలో ఏపీ39జేసీ 3282 నెంబరు గల బైక్‌పై యు.కొత్తపల్లి మండలం కొండెవరం గ్రామం శొంఠివారిపాలెనికి చెందిన వెంగల గోవిందు(46) పని ముగించుకుని ఒక పక్క నుంచి వస్తుండగా లారీ ఢీకొంది. దీంతో గోవిందు అక్కడికక్కడే రోడ్డుపై పడిపోవడంతో అపస్మారకస్థితిలోకి వెళ్లిపోయాడు. అతడు ప్రస్తుతం ప్రాణాపాయస్థితిలో ఉన్నాడని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సర్పవరం సీఐ పెద్దిరాజు తెలిపారు.

సీసీ రోడ్ల పనుల పరిశీలన

సామర్లకోట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): పల్లెపండుగ పేరిట కూటమి ప్రభుత్వం గ్రామాల్లో నిర్మిస్తున్న సీసీ రోడ్లతో గ్రామాలకు మహర్దశ రానుందని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప అన్నారు. మండలంలో రూ.10 కోట్లతో కేంద్రప్రభుత్వ నిధులతో నిర్మిస్తున్న సీసీ రోడ్ల నిర్మాణపు పనుల్లో భాగంగా వేట్లపాలెంలోని జొన్నలదొడ్డి, కొత్తచెరువు చేనేత కాలనీలలో పలు సీసీ రోడ్ల పనులను ఎమ్మెల్యే మంగళవారం పరిశీలించారు. పెద్దాపురం నియోజకవర్గానికి తొలివిడతగా మంజూరైన రూ.10 కోట్లతో సీసీ రోడ్లు నిర్మాణపు పనులు అన్ని గ్రామాల్లో నాణ్యతా ప్రమాణాలతో నిర్మిస్తున్నారని తెలిపారు. ఉప సర్పంచ్ గోలి శ్రీరామ్‌చౌదరి, గుమ్మళ్ళ రామకృష్ణ, నవీన్, ముమ్మిడి శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.



వేట్లపాలెంలో సీసీ రోడ్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజప్ప

'ఆయుష్' యాప్‌లో నమోదు చేయించుకోండి

కాకినాడ ఆర్డీవో మల్లిబాబు



బ్రోచర్ విడుదల చేస్తున్న ఆర్డీవో

కాకినాడ సిటీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): దేశ్ కా ప్రకృతి పరీక్షణ్ అనే ఆయుష్ మొబైల్ యాప్‌లో ప్రతి పౌరుని శారీరక, మానసిక, ఆరోగ్య సమాచారం పొందుపరిచి ఉంటుందని కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు తెలిపారు. ధన్వంతరి జయంతి నాడు ప్రధాని మోదీ ప్రారంభించిన ఈ యాప్‌ను మంగళవారం కాకినాడలోని తమ కార్యాలయంలో ఆర్డీవో ప్రారంభించి మాట్లాడుతూ ఈనెల 26 నుంచి డిసెంబర్ 25 వరకు నెల రోజులపాటు ఈ యాప్ ప్రజలకు అందుబాటులో ఉంటుందన్నారు. ఈ గడువులోగా ప్రతి పౌరుడు తమ సమాచారాన్ని ఆయుష్ డిపార్ట్‌మెంట్ ఆయుర్వే వైద్యుల వద్ద నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ ప్రక్రియ పూర్తి చేసేందుకు ప్రతి వ్యక్తికి కనీసం 36 నిమిషాలు సమయం పడుతుందన్నారు. దీనిలో నమోదు చేసుకోవడం వల్ల ఆరోగ్య సమాచారం, దిన చర్య వంటివి ప్రభుత్వం ద్వారా మొబైల్ నంబర్‌కు ఎప్పటికప్పుడు మెసేజ్‌ల రూపంలో పంపడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఈ సదుపాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తొలుత బ్రోచర్‌ను విడుదల చేసిన ఆర్డీవో కాకినాడ మొదటి పౌరునిగా యాప్‌లో సనమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆయుర్వేద వైద్యులు డాక్టర్ నీరజ, డాక్టర్ రేణుక, డాక్టర్ సయ్యద్ అలీ, డాక్టర్ విజయలక్ష్మి, శ్రీనివాస్, ఆయుర్వేదశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యారంగాన్ని కాపాడే నిర్ణయాలు తీసుకోవాలి

ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

కొత్తపల్లి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం విద్యారంగాన్ని కాపాడే నిర్ణయాలను తీసుకోవాలని ఎస్టీయూ రాష్ట్రప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి అన్నారు. మండలంలో మంగళవారం పలు పాఠశాలలను ఆయన సందర్శించారు. అనంతరం ఉప్పాడ కొత్తపల్లి జిల్లా వీర్రాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. పాఠశాలల్లో విద్యార్థుల మానసిక స్థితిని, అభ్యసన, సంసిద్ధతను పరిగణనలోకి తీసుకోకుండా పాఠశాలల పనివేళల పెంపు నిర్ణయం తీసుకోకూడదని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఉపాధ్యాయులకు 2023 జూలై నుంచి అమలు కావాల్సిన 12వ పీఆర్సీ ఇప్పటికే 17 నెలలు ఆలస్యమైందన్నారు. వెంటనే 30శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు చెల్లించాల్సిన 11వ పీఆర్సీడీఏ, సరెండర్ లీవ్ బకాయిలు, పీఎఫ్, ఏపీజీఎల్ఐ తుది చెల్లింపులపై తగు చర్యలు చేపట్టాలన్నారు. ప్లస్‌టూ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరతను తీర్చాలని కోరారు. విద్యారంగం నష్టపోయే జీవో 117ను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఎస్టీయూ కొత్తపల్లి మండలాధ్యక్షుడు ఆనందరెడ్డి, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి సత్యనారాయణరాజు, కార్యదర్శి యుశ్రీను ఉపాధ్యాయులు ఉన్నారు.



ఉప్పాడలో మాట్లాడుతున్న రఘునాథరెడ్డి

బాల్య వివాహాలు నిర్మూలించాలి



పిఠాపురంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు

పిఠాపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నిర్మూలనలో అందరూ భాగస్వాములు కావాలని ఐసీడీఎస్ జిల్లా బాలల రక్షణ అధికారి వెంకట్, జిల్లా చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్ బి.శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం పిఠాపురం రథాలపేట సెంటర్‌లోని అంబేడ్కర్ హాల్‌లో సీడీపీవో దుర్గాదేవి ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలను, కిశోర వికాసంపై అవగాహన కార్యక్రమం జరిగింది. బాల్య వివాహాల నిర్మూలన కమిటీలు గ్రామాల్లో ఏ విధంగా పని చేయాలి, బాలికలపై లైంగిక దాడి, పోక్సో చట్టం, వ్యక్తిగత భద్రత, సైబర్ క్రైం తదితర అంశాలను వివరించారు. కిశోర బాలికల తీసుకోవలసిన పోషకాలపై అవగాహన కల్పించారు. రిటైర్ లెక్చరర్ అనంతలక్ష్మి, గైనకాలజిస్టు సుజాత, టౌన్ మణికుమార్, పీఈటీ సత్యప్రియ పాల్గొన్నారు.

కార్పొరేషన్ డైరెక్టర్లకు సత్కారం

కాకినాడ సిటీ, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): టీడీపీలో కష్టపడిన వారికి తగిన ప్రతిఫలం లభిస్తుందని కాకినాడ రూరల్ టీడీపీ కోఆర్డినేటర్ కటకంశెట్టి వెంకట ప్రభాకర్ (బాబీ) పేర్కొన్నారు. మంగళవారం మోహన్‌నగర్‌లోని తిరుమల ఫంక్షన్‌హాల్‌లో బాబీ ఆధ్వర్యంలో కార్పొరేషన్ డైరెక్టర్ పదవులు పొందిన శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ మట్టా ప్రకాష్ గౌడ్, మాల కార్పొరేషన్ డైరెక్టర్ కొల్లాబత్తుల అప్పారావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో రూరల్ మండల అధ్యక్షుడు రాందేవు సీతయ్యదొర, కరప మండల మాజీ ఎంపీపీ గుల్లపల్లి శ్రీనివాస్, కముజు నెహ్రూ, కాకరపల్లి చలపతి, ఏటుకూరి నాగమణి, కంచుమర్తి లావణ్య, లోవరాజు, మార్కండేయులు, దొరబాబు, శివాజీ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



కార్పొరేషన్ డైరెక్టర్లను సత్కరించిన బాబీ

జీజీహెచ్ మేనేజర్‌కు కలెక్టర్ మెమో జారీ

కాకినాడ క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): నర్సింగ్ పోస్టుల్లో అక్రమ విక్రయాలకు పాల్పడిన కాకినాడ జీజీహెచ్ పరిపాలనా విభాగ మేనేజర్ వైవిఎస్ఎన్ నరసింగరావుకు జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ మెమో జారీ చేశారు. ఈ మెమోలో నర్సింగ్ పోస్టుల అవినీతికి సంబంధించిన పలు ప్రశ్నలు సంధించారు. అవకతవకలు నిర్ధారణ అయిన నేపథ్యంలో ఎందుకు చర్యలు తీసుకోకూడదో వివరణ ఇవ్వాలని మెమోలో కోరారు. ఈ విషయంపై కలెక్టర్‌ను వివరణ కోరగా నరసింగరావుపై జరిగిన తొలి విచారణకు సంబంధించిన నివేదిక ఆధారంగా తాజా మెమోను జారీ చేశామని తెలిపారు. మంజూరైన పోస్టుల్లో జరిగిన అవినీతిపై విచారణ చేపట్టగా సంబంధిత చర్యలు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. మేనేజర్ వివరణ ఆధారంగా తదుపరి చర్యలకు ఉపక్రమిస్తామని కలెక్టర్ పేర్కొన్నారు.

మద్యం తాగి వాహనాలు నడిపినవారికి జైలు, జరిమానా

కాకినాడ క్రైం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన 35 మందికి కాకినాడ మూడవ స్పెషల్ జ్యూడిషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి. నరసింహరావు జైలు, జరిమానా విధిస్తూ మంగళవారం తీర్పు చెప్పారు. కాకినాడ ట్రాఫిక్ సీఐలు ఎస్.రమేష్ డి.రామారావు బృందాలతో సోమవారం రాత్రి డ్రంకన్ డ్రైవ్ నిర్వహిస్తుండగా మోతాదు దాటి మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిని బ్రీత్ ఎనలైజర్లతో పరిక్షీంచగా 35 మంది పట్టుబడ్డారు. వారిని కోర్టులో హాజరుపర్చగా 19 మందికి ఒక్కోక్కరికి రెండు రోజుల చొప్పున జైలు శిక్ష, మరో 16 మందికి ఒక్కోక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధించినట్లు సీఐ రమేష్ తెలిపారు.

మద్యంతో వ్యక్తి అరెస్ట్

తాళ్లరేవు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): యానాం నుంచి అక్రమంగా మద్యం తరలించి పి.మల్లవరంలో విక్రయిస్తున్న నిమ్మకాయల సూరిబాబును మంగళవారం పట్టుకుని 10 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ కె.కోటేశ్వర్ తెలిపారు. కేసు నమోదుచేసి రిమాండ్‌కు పంపించినట్లు చెప్పారు.

బైండోవర్ కేసులు నమోదు

తాళ్లరేవు మండలంలో అక్రమంగా మద్యం తరలిస్తూ పట్టుబడ్డ 10మంది నిందితులపై తహశీల్దార్ సమక్షంలో బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు సీఐ కె.కోటేశ్వర్ తెలిపారు.

ఆలయ ప్రహరీ పున:నిర్మాణానికి అనుమతి

కాకినాడ రూరల్, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం సర్పవరంలోని భావనారాయణ స్వామి ఆలయ ప్రహరీ పున:నిర్మాణానికి అనుమతినిచ్చినట్లు పురావస్తు శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ కె.తిమ్మరాజు తెలిపారు. వివరాల్లోకి వెళితే గత 7ఏళ్ల క్రితం కురిసిన అధిక వర్షాలకు పురాతనమైన ఆలయ ప్రహరీ గోడ కూలిపోయింది. అయితే ఆ గోడ పున:నిర్మాణానికి అయ్యేఖర్చును పురావస్తు శాఖ అధికారులు అంచనావేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలను పంపినా ఏవిధమైన పురోగతిలేక పోవడంతో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పుల్లశ్రీరాములు చొరవతో అనుమతి లభించింది. అంతేకాకుండా దేవస్థానం నిధులతో ఆ గోడను గానుగ సున్నంతో కట్టుటకు, అదే విధంగా దాతలతో గోశాల, కార్యాలయ గదిని, నిత్యాన్నదానం చేసుకోవడానికి అనమతినిచ్చారు.

షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం

పెద్దాపురం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా గృహోపకరణాలు దగ్ధమైన సంఘటన స్థానిక శోభా థియేటర్ సమీపంలో మంగళవారం జరిగింది. అగ్నిమాపకశాఖ అధికారులు వివరాల ప్రకారం... కొత్త చిట్టికి చెందిన ఇంట్లో ఇంట్లో ఉన్న గృహోపకరణాలు ఫ్రిజ్, ఏసీ తదితర గృహోపకరణాలు దగమయ్యాయి. సుమారు రూ. లక్ష నష్టం ఆస్తినష్టం సంభవించినట్లు తెలిపారు.

రీసర్వే గ్రామ సభ

సామర్లకోట, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రావువారిచంద్రంపాలెంలో మంగళవారం నిర్వహించిన రీసర్వే గ్రామ సభలో వివిధ సమస్యలకు చెందిన 33 మంది రైతులు ఫిర్యాదులను వీఆర్వోలకు అందజేశారు. అధికారి శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభలో రీసర్వే సమస్యలు పరిష్కారతీరు, రైతులు చేయాల్సిన పనులు అనే అంశంపై సమగ్రంగా వివరించారు. సర్వేయర్ పి.సీతారామాచార్యులు, సృజనాదేవి, మోషేరాజు, దినేష్, వీఆర్వోలు ఖాదర్‌వల్లీ, పద్మనాభం రైతులు పాల్గొన్నారు.

భీమేశ్వరాలయంలో పూజలు

సామర్లకోట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాస మహాపర్వదినాలు పురస్కరించుకుని మంగళవారం సామర్లకోట కుమారరామ భీమేశ్వరాలయంలో విశేష పూజలు నిర్వహించారు. తెల్లవారుజామున గోపూజలు నిర్వహించి పూజలను ప్రారంభించారు. ఆలయ పండితులు వేదమంత్రోచ్ఛారణల మధ్య అభిషేక, పుష్పార్చన పూజలు నిర్వహించారు. శ్రీపాద రాజశేఖర ఘనాపాఠి నేతృత్వంలో మేకా శ్రీనివాస్ దంపతులు, కాకినాడకు చెందిన సూర్యనారాయణస్వామి దంపతులు మారేడు దళాలతో స్వామివారికి అర్చనలు నిర్వహించారు.సాయంత్రం ఆకాశదీప పూజలు జరిగాయి.



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

రేపు విధుశేఖర భారతీ మహాస్వామి రాక

తుని రూరల్, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి ఆధ్యాత్మిక పీఠం తపోవన కాశీ క్షేత్రానికి ఈనెల 28న శృంగేరీ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీవిధుశేఖర భారతీమహాస్వామి విచ్చేస్తున్నట్టు క్షేత్ర పీఠాధిపతులు శ్రీ సచ్చిదానంద సరస్వతిస్వామిజీ తెలిపారు. సహస్ర మోదక గణపతిహోమం, శ్రీరుద్ర యోగ పూర్ణాహుతి, విద్వద్సగోష్టి పలు కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు.

జగ్గంపేట

• జగ్గంపేట • తుని • ప్రత్తిపాడు


ప్రత్తిపాడులో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న పీసీసీ సభ్యుడు ధర్నాలకోట శ్రీను

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • దేవీపట్నం • రాజవొమ్మంగి • అడ్డతీగల • గంగవరం • వై రామవరం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక


అంబేడ్కర్ చిత్రపటానికి పుష్పమాల వేసి నివాళులర్పిస్తున్న ఐటీడీఏ పీవో సింహాచలం

ఘనంగా రాజ్యాంగ ఆమోద దినోత్సవం

రంపచోడవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఐటీడీఏ కార్యాలయంలో రాజ్యాంగ ఆమోద దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. అంబేడ్కర్ చిత్రపటానికి ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, ఎస్‌డీపీవో సాయి ప్రశాంత్ పుష్పమాలలు వేసి నివాళులర్పించారు. పీవో మాట్లాడుతూ రిజర్వేషన్ ఫలాలు పొందుతున్న ప్రతి ఒక్కరూ అంబేడ్కర్‌ను స్మరించుకోవాలన్నారు. వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఏపీవో (జి) డీఎన్‌వీ రమణ, డిప్యూటీ డైరెక్టర్ విజయశాంతి, పీహెచ్‌వో కె.చిట్టిబాబు, పీఏవో ఎల్.రాంబాబు, తహసీల్దార్లు ఏఎన్‌వీ రామకృష్ణ, బాలాజీ, ఎంపీడీవోలు ఎస్.శ్రీనివాస్ దొర, విశ్వనాథ్, అటవీ రేంజ్ అధికారి అనూష, ఏటీడబ్ల్యువో రామతులసి, బి.రాజు, శ్రీనివాసరావు, వేణుగోపాల్, నాగభూషణం, పి.భీమిరెడ్డి, ఆర్.వెంకటేశ్వరరావు, చక్రధర్, రాజన్, సీహెచ్ సోమిరెడ్డి, జి.ఆనంద్, డి.ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.


కూనవరంలో మాట్లాడుతున్న సబ్ డీఎఫ్‌వో రాఘవరావు

'దేశ ప్రజలందరినీ ఐక్యం చేసిన రాజ్యాంగం'

కూనవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): భారత రాజ్యాంగం దేశ ప్రజలందరినీ ఐక్యం చేసిందని సబ్ డీఎఫ్‌వో రాఘవరావు అన్నారు. అటవీ శాఖ కార్యాలయంలో రాజ్యాంగ ఆమోద దినోత్సవం నిర్వహించారు. రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ చిత్రపటానికి పుష్పమాలలు వేసి నివాళులర్పించారు. అటవీ శాఖ సిబ్బందితో రాజ్యాంగ పీఠికను చదివించారు. ఎఫ్ఆర్‌వో కరుణాకరణ్, అటవీ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

మోతుగూడెం (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏపీ జెన్‌కో డీఏవీ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు మల్లెల రఘురాం ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ ఆమోద దినోత్సవం నిర్వహించారు. ఒక బాలుడు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వేషధారణలో ఆకట్టుకున్నారు. పీహెచ్‌సీలో వైద్యాధికారి నఫియా సుల్తాన్, సిబ్బంది ఆధ్వర్యంలో వేడుక నిర్వహించారు. వై.రామవరం మండలం డొంకరాయి గ్రామ సచివాలయంలో సర్పంచ్ కుమారి వేమసంధ్యారాణి అధ్యక్షతన రాజ్యాంగ దినోత్సవం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంపీటీసీ కరకా వెంకటరమణ, వై.రామవరం ఈవోపీఆర్డీ డి.శివకుమార్ హాజరయ్యారు. సచివాలయ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.


మోతుగూడెం డీఏవీ పాఠశాలలో...



మోతుగూడెం పీహెచ్‌సీలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్య సిబ్బంది

రైతులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

రంపచోడవరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): రైతులు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కేంద్ర కార్మిక, రైతు సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కేంద్ర కార్మిక, రైతు సంఘాల సమన్వయ కమిటీ డివిజన్ కార్యదర్శి పల్లాల లచ్చిరెడ్డి మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనం రూ.26వేలు నిర్ణయించి అమలు చేయాలన్నారు. రైతులు, వ్యవసాయ కార్మికులకు నెలకు రూ.10వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, 2013 భూసేకరణ చట్టాన్ని అమలు చేయాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యు జిల్లా కార్యదర్శి పి.అనసూయ, ఏఐకేఎంఎస్ నాయకుడు కె.బాలురెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీలో పాల్గొన్న కార్మిక సంఘాల నేతలు

విద్యార్థులకు దుస్తుల పంపిణీ

చింతూరు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య భారతి, భారత్ వికాస్ పరిషత్ (విజయవాడ) ఆధ్వర్యంలో మంగళవారం కస్తూర్బా పాఠశాల విదార్థులకు దుస్తులు అందజేశారు. కార్యక్రమంలో సేవా భారతి వైద్యుడు గంగాధర ప్రసాద్, సేవా ప్రముఖ్ ఆవుల సుబ్బారావు, సమరసత సేవా ఫౌండేషన్ ప్రతినిధి పద్మావతి పాల్గొన్నారు.



ఘనంగా రాజ్యాంగ దినోత్సవం



జగ్గంపేటలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, కిర్లంపూడిలో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

జగ్గంపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ దేవరపల్లి చెన్నారావు నేతృత్వంలో మంగళవారం రాజ్యాంగ దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. భిన్నత్వంలో ఏకత్వాన్ని, జాతీయ సమైక్యతను ప్రతిబింబిస్తూ మానవహారాన్ని చేపట్టారు. రాజ్యాంగ స్ఫూర్తిని గుర్తు చేసుకుంటూ ప్రతిజ్ఞ చేశారు. ముఖ్య అతిథిగా స్థానిక అడ్వకేట్ శ్రీ సాతారామ స్వామి హాజరయ్యారు. కార్యక్రమంలో ఐక్యూఏసీ కో ఆర్డినేటర్ డాక్టర్ పీవీవీ సత్యనారాయణ, వారణాసి మల్లికార్జున శర్మ, అకడమిక్ కో ఆర్డినేటర్ విశ్వేశ్వరరావు, ఝాన్సీ దేవి ఉన్నారు. జగ్గంపేట పాత ఎస్సీ బాలుర వసతిగృహంలో అంబేడ్కర్ వాది నీలపల్లి అప్పారావు ఆధ్వర్యంలో డాక్టర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో దేవాబత్తుల దానియేలు, మర్రి పృథ్వీరాజ్, జోడా చైతన్యకుమార్, మూరా గోపి, జుత్తుక రమేష్, చెరుకూరి రాజు, బోండు సుధాకర్, సైనం మోషే, మూరా నాగు, తలారి చిన్ని, వేమగిరి రవికుమార్, కొత్తపల్లి మల్లన్న, యల్లమిల్లి లోవరాజు పాల్గొన్నారు.

కోటనందూరు: కోటనందూరులో కమ్యూనిటీ హాలు దగ్గర అంబేడ్కర్ విగ్రహానికి దళిత టీడీపీ నేత గంటా అమ్మాజీ, కడితి చిన నూకరాజు ఆధ్వర్యంలో నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ డిచిరీంజీవిరాజు, వెలగా వెంకట కృష్ణారావు, లగుడు సత్యనారాయణమూర్తి, దార కొండ జోగిరాజు, పల్లా కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రౌతులపూడి: రౌతులపూడిలో యుటీఎఫ్ ఆధ్వర్యంలో బాలురవసతి గృహం, మార్కెట్ సెంటర్ నందు అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయుల కన్వీనర్ నెమ్మాది సింహాచలం, యుటీఎఫ్ మండలాధ్యక్షుడు కోరుప్రోలు హరిబాబు, రాష్ట్ర ఆదివాసీ సంఘం అధ్యక్షుడు గంటిమళ్ల సత్తిబాబు, బర్రేరాజేశ్వరరావు, వార్డెన్ వీరభద్రరావు ఉన్నారు.

గండేపల్లి: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో రాజ్యాంగ పీఠికపై ప్రతిజ్ఞ చేయించారు. పరిపాలనాధికారి కె.చంద్రరావు, ఎంఈవో నాయక్, హౌసింగ్ ఏఈ బి.రాంబాబు, ఏపీఎం పి.సన్యాసిరావు, ఏపీవో ఆర్.గంగాభవానీ పాల్గొన్నారు. సూరంపాలెంలో ఆదిత్య యూనివర్శిటీలో విద్యార్థులతో రాజ్యాంగ ప్రతిజ్ఞ చేయించి వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశామని డిప్యూటీ ప్రోఛాన్సలర్ ఎం.శ్రీనివాసరెడ్డి తెలిపారు.

అంబేడ్కర్‌కు ఘన నివాళి

విద్యార్థులకు పోటీలు, బహుమతులు

అన్నవరం: అన్నవరంలో అంబేడ్కర్ విగ్రహం వద్ద సర్పంచ్ కుమార్‌రాజా రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దడాల సతీష్, రాజాల చిట్టిబాబు, తాటిపాక రాంజీ, కృష్ణ, అంబేడ్కర్ యూత్ సభ్యులు పాల్గొన్నారు. సత్యదేవా జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ ఘంటశాల వెంకట్ రాజ్యాంగం గొప్పతనం వివరించి రాజ్యాంగంపై అవగాహన ఉండాలన్నారు. అధ్యాపకులు ప్రసాద్, వీరభద్రరావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు మాణిక్యాంబ, ఎస్ గోవింద్ పాల్గొన్నారు.తొండంగిలో పెద్దాపురం డీఎస్పీ శ్రీ హరిరాజు, తుని సీఐ చెన్నకేశవరావు, ఎస్ఐ జగన్మోహనరావులు అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

కిర్లంపూడి: మండల పరిషత్ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ విస్తరణాధికారి ఎస్.సత్యప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయులు ఎల్.కృష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రత్తిపాడు: ప్రత్తిపాడులో కోర్టు బార్ కార్యాలయంలో జడ్జి కాటం భాను, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు, కార్యదర్శి బి.మధుబాబు అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గోళ్ళ కాంతి సుధాకర్, ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అంబేడ్కర్, గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజ్యాంగ ప్రతిజ్ఞను ఎంపీడీవో చేయించారు. కళామందిర్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి పీసీసీ సభ్యుడు ధర్నాల కోట శ్రీను తదితరులు పూలమాల వేశారు.

ఏలేశ్వరం: మండల పరిషత్ కార్యాలయంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్, మహాత్మాగాంధీ చిత్రపటాలకు ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి పూలమాలలు వేసి నివాళులర్పించి ప్రతిజ్ఞ చేశారు. పట్టణంలో అంబేడ్కర్ విగ్రహాలకు దళిత సంఘాలు పూలమాలలువేసి నివాళులర్పించారు.

తుని రూరల్: తుని సీఎంఆర్ సెంటర్‌లో అంబేడ్కర్ విగ్రహానికి మాజీ మంత్రి దాడిశెట్టి రాజా పూలమాలలు వేసి నివాళులర్పించారు. పాయకరావుపేట శ్రీ ప్రకాష్ విద్యాసంస్థల్లో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అడ్వకేట్ జీపీ మధు రాగ్రెస్ ప్రసంగించారు. ప్రిన్సిపాల్ ఎ.రామకృష్ణారెడ్డి, ఉపాధ్యాయు లు, విద్యార్థులు పాల్గొన్నారు. హంసవరంలో ఏపీ మోడల్ స్కూల్లో వేడుకలు నిర్వహించారు. ప్రిన్సిపాల్, విద్యార్థులున్నారు.

శంఖవరం: మండలంలో శంఖవరం, కత్తిపూడి గ్రామాల్లో అంబేడ్కర్ విగ్రహాలకు పలువురు పాలాభిషేకం చేసి నివాళులర్పించారు.

తీర్థకావిడి ఉత్సవం


కత్తిపూడిలో ఊరేగింపు చేస్తున్న భక్తులు

శంఖవరం, నవంబరు 26: (ఆంధ్రజ్యోతి) కత్తిపూడిలో సుబ్రహ్మణ్యుడి తీర్థకావిడి ఉత్సవం వైభవంగా జరిగింది. ఏటా వల్లిదేవసేనుడికి ఘనంగా పూజలు నిర్వహించి తీర్థకావిడి ఉత్సవంగా చెయ్యడం ఆనవాయితీగా పెట్టుకుని ఇక్కడి భక్తులు ఈ ఏడాది కూడా ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారిని గ్రామ పురఃవీధుల్లో ఊరేగించారు. పరిసర గ్రామాల సుబ్రహ్మణ్యస్వామి మాలధారులు, భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామపెద్దలున్నారు.

మోకాళ్లపై కార్మికుల నిరసన

ఏలేశ్వరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిన్నింపేట ఇంటర్ స్నాక్స్ కాజు ఇండియా ప్రవేట్ లిమిటెడ్ వద్ద మంగళవారం కార్మికులు మోకాళ్లపై నిరసన తెలిపారు. ఫ్యాక్టరీలో పనిచేస్తున్న కార్మికులు తమకు న్యాయం చేయాలని ఫ్యాక్టరీ గేటు ముందు కొద్ది రోజులుగా ఆందోళన చేస్తున్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యం రాత్రికి రాత్రే సెలవులు ప్రకటించడంతో తాము జీవనోపాధి కోల్పోయామని సుమారు 450 మంది కార్మికులు గగ్గోలు పెడుతున్నారు. యాజమాన్యం తమకు ఒక్కొక్కరికి రూ.2లక్షలు నష్ట పరిహారం ఇప్పించాలని డిమాండ్ చేశారు. తమకు న్యాయం జరిగే వరకు నిరసన కొనసాగిస్తామన్నారు.


మోకాళ్లపై నిరసన తెలుపుతున్న కార్మికులు

'సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి'

ప్రత్తిపాడు, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): సమస్యల పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలని మండల ప్రజా ప్రతినిధులు కోరారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎంపీపీ గోళ్ళ కాంతి సుధాకర్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ప్రజా ప్రతినిధులు, విద్యుత్ ఇరిగేషన్, ఆర్‌డబ్ల్యూఎస్ సమస్యలపై ఏకరువు పెట్టారు. గ్రామాల్లో విద్యుత్ లైన్‌లు, స్థంభాలు అధ్వాన్నంగా ఉన్నాయని, జలజీవన్ మిషన్‌లో చేపట్టిన పైపులైన్లు పూర్తికాక తాగునీటి సమస్యలు ఉంటున్నాయని, సుబ్బారెడ్డి సాగర్‌కు చెందిన ఎం4ఛానల్ అభివృద్ధి చేయకపోవడం వల్ల తాగు నీరందడంలేదని, ఏలేరు ఎడమ కాలువ నీటిని పైపులైన్ ద్వారా పొలాలకు మళ్లించే అవకాశం ఇవ్వాలని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అమరాది వెంకటేశ్వరరావు, మంతెన శ్రీను, సేంద్రపు భాస్కరరావు, పిల్లా కొండలరావు, ఉమ్మడి అచ్చెన్న సమావేశం దృష్టికి తెచ్చారు. ఎంపీపీ సుధాకర్, ఎంపీడీవో కుమార్‌బాబు మాట్లాడుతూ గ్రామాల్లో బాల్య వివాహాలు జరగకుండా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు చొరవ చూపాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం లబ్ధిదారులకు అందే విధంగా కృషి చేయాలన్నారు. ఎంఈవో పి.రాజబాబు, విద్యుత్ శాఖ ఏఈ అడిగళ్ళ శ్రీను, ఇరిగేషన్, ఐసీడీఎస్ అధికారులు ప్రసంగించారు.

'గ్రామాల అభివృద్ధే లక్ష్యం'

ఏలేశ్వరం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధే లక్ష్యమని.. గ్రామాల్లో సమస్యల పరిష్కారం దిశగా సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అడుగులువేయాలని ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి అన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల అధికారులు గ్రామాల్లో సమస్యలు, అభివృద్ధి పనుల సూచనలను సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు వివరించారు. తూర్పులక్ష్మీపురం ఎంపీ టీసీ యిజనగిరి ప్రసద్ మాట్లాడుతూ తమ గ్రామానికి ఆర్టీసీ బస్సు సౌకర్యం లేక పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే అనేకమంది విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామంలో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరారు. శ్మశాన వాటిక నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరారు. ఇన్‌చార్జి ఎంపీడీవో సూర్యనారాయణ, వైస్ ఎంపీపీలు రాజ్యలక్ష్మీదేవి, సాదే శ్రీను, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

డొక్కా సీతమ్మ క్యాంటీన్

జగ్గంపేట, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట పాత పోలీస్‌స్టేషన్ వద్ద ప్రతి మంగళవారం జనసేన ఇన్‌చార్జ్ తుమ్మలపల్లి రమేష్ ఆధ్వర్యంలో డొక్కా సీతమ్మ ఉచిత క్యాంటీన్ నిర్వహిస్తున్నారు. మంగళవారం కిర్లంపూడికి చెందిన జనసేన నాయకుడు ఎల్లపు దొరబాబు ఆర్థిక సాయంతో సుమారు 400 మందికి భోజనాలను ఏర్పాటు చేయగా తుమ్మలపల్లి హాజరై వడ్డించారు. ఎల్లపు దొరబాబు, రాజనాల శ్రీను, సూరపు రెడ్డి నరేష్, మాదారపు వీరబాబు, గంధం శ్రీని వాస్, దొడ్డా శ్రీను, గోకేడ ప్రసాద్, మొగిలి గంగాధర్, కాయల మణికంఠ, పాలెం బాబి పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై అవగాహన

రౌతులపూడి, నవంబరు 26(ఆంధ్రజ్యోతి): రౌతులపూడి వెలుగు కార్యాలయం నందు బాల్యవివాహాలపై అవగాహన సదస్సును విస్తరణ అధికారిణి జానకి ఆధ్వర్యంలో నిర్వహించారు. బాల్య వివాహాల వల్ల పిల్లల్లో వచ్చే ఇబ్బందలను తల్లిదండ్రులకు లాయర్ డాక్టర్ వై.వసంత్, జానకి వివరించారు. సదస్సులో శంఖవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి పద్మావతి, ఎంఈవో2 గాడి కొండబాబు, వైద్యురాలు డాక్టర్ సౌందర్య తదితరులు పాల్గొన్నారు.

శివపార్వతుల కల్యాణం


శివపార్వతుల కల్యాణం దృశ్యం

ప్రత్తిపాడు, నవంబరు26(ఆంధ్రజ్యోతి): రాచపల్లిలోని అరుణాచల దేవస్థానంలో మంగళవారం రాత్రి శివపార్వతుల కల్యాణం వైభవంగా నిర్వహించారు. రమణ సేవా శ్రమ నిర్వాహకులు రమానంద స్వామి ఆధ్వర్యంలో అపీత కుంచాబ సమేత అరుణాచలేశ్వర స్వామికి శాస్త్రోక్తంగా పూజలు కల్యాణోత్సవం చేశారు.


చదలవాడ పంచాయతీలో వరి చేను కోస్తున్న మహిళలు

ముమ్మరంగా వరి కోతలు


కుప్పలు వేస్తున్న మహిళలు

మోతుగూడెం, నవంబరు 26 (ఆంధ్రజ్యోతి): మోతుగూడెం పరిధిలోని చదలవాడ పంచాయతీలో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. వర్షాలు సకాలంలో పడడంతో గత సంవత్సరం కంటే ఈ ఏడాది దిగుబడి అధికంగా ఉందని గిరిజన రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వరి చేలు పూర్తిస్థాయిలో పండడంతో గిరిజనులు ఇతర పనులు పెట్టుకోకుండా కోతల్లో నిమగ్నమయ్యారు. త్వరగా కోయకపోతే ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయే ప్రమాదం ఉందని చెప్తున్నారు. చదలవాడ పంచాయతీ పరిధిలోని అన్ని గ్రామాల్లో వరి కోతలు సగానికి పైగా పూర్తయ్యాయి. కొందరు వాటిని కుప్పలుగా వేస్తున్నారు.